# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 263 గురువారం 16 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

*Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri*





## ఆడవాళ్ల కదలికపై మీకెందుకంత ఆసక్తి?

- అమిత్‌షాపై ప్రియాంక మండిపాటు
- మహిళల కార్యకలాపాలపై అమిత్‌షా నిఘా వేయడం ఏమిటని
- ఝార్ఖండ్‌లో తాను పర్యటించిన సమాచారాన్ని ఆయన ఎలా సేకరించారు
- "ముఖ్యంగా మహిళలతో సహా ఎవరు ఏం చేస్తున్నారు?
- ఎప్పుడు, ఎక్కడ ఉన్నారు? అనే దానిపై ఆయన దృష్టి సారిస్తుంటారు

# కమలనాథుల కదనోత్సాహం

- ఓటింగ్ సరళిపై సంతృప్తి
- సికింద్రాబాద్ , మల్కాజిగిరి, చేవెళ్లలో గెలుపుపై ధీమా
- మంచి మెజార్టీతో సీట్లు కైవసం చేసుకుంటామని ధీమా
- హైదరాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరుగుతుందని భావన
- గ్రేటర్ పరిధిలోని నాలుగు స్థానాల్లో గట్టి అభ్యర్థులను నిలబెట్టిన అధిష్టానం




హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంచి మెజార్టీతో సీట్లు కైవసం చేసుకుంటామని, హైదరాబాద్ నియోజకవర్గం లో ఓటింగ్ శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈసారి ప్రధాని మోదీ హవా బాగా కనిపించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులకు ఓటు వేసిన వారు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వేశారని నాయకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో తక్కువ స్థానాలు రావడంతో లోక్‌సభ ఎన్నికలను బీజేపీ నాయకులు సవాల్‌గా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలోని నాలుగు స్థానాల్లో గట్టి అభ్యర్థులను నిలబెట్టారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, -మిగతా3లో



## 'ఇండియా' కూటమికి బయట నుంచి తాము మద్దతిస్తాం

- కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతుపై మమత కీలక వ్యాఖ్యలు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో ఎన్నికల కమిషన్ ఒక కీలుబొమ్మలా పనిచేస్తోంది
- రెండున్నర నెలల పాటు ఎన్నికల షెడ్యూల్ ఉండటాన్ని తప్పుపడుతూ కాషాయం పార్టీకి అనుకూలంగా ఈసీ వ్యవహరించింది
- బీజేపీ 400 సీట్లు గెలుస్తామని చెబుతున్న లక్ష్యం జరగదు




## కాంగ్రెస్ హయాంలో వరుస బాంబు పేలుళ్లు

- సోనియా-మన్మోహన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో బాంబు పేలుళ్లు జరిగాయి
- కశ్మీర్‌లో పరిస్థితిని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది
- తమ ఓటు బ్యాంక్ కోల్పోతామనే భయంతో మౌనంగా ఉంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

# ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

- ఎన్డీఏ కూటమి గెలుస్తుంది
- ఏపీలో అల్లర్లపై కఠినంగా వ్యవహరించాలి
- ఏపీలో ఎన్నికలపై కొంత నిరాశ, నిస్పృహ ఉండొచ్చు
- ప్రజల్లో మార్పు రావడంతో అభ్యర్థులు గొడవకు దిగారు
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి
- ప్రజలు ఎవరు కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని నమ్మలేదు

ఢిల్లీ

ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని.. ఎన్డీఏ కూటమి గెలుస్తుందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అల్లర్లపై కేంద్ర ఎన్నికల కమిషన్, ఏపీ పోలీసులు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఏపీలో ఎన్నికలపై కొంత నిరాశ, నిస్పృహ ఉండొచ్చని.. అందుకే అల్లర్లు జరిగి ఉండొచ్చని తెలిపారు. ప్రజల్లో మార్పు రావడంతో అభ్యర్థులు గొడవకు దిగారని అన్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకొచ్చారు. ప్రజలు ఎవరు కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని నమ్మలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లను తీసివేస్తుందని కాంగ్రెస్ చెప్పిందని.. ఈ విషయాన్ని ప్రజలు నమ్మలేదని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విష ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ గుర్తు మారిపోయిందేమో.. ప్రజలు ఆ పార్టీ గుర్తు గాడిద గుడ్డు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. -మిగతా3లో



# రాష్ట్రంలో తగ్గని పొలిటికల్ ఫీవర్


మరో ఎన్నికపై పార్టీలు ఫోకస్..

ఈ నెల చివరన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నికకు పార్టీలు రెడీ

మూడు జిల్లాల నేతలతో మూడు పార్టీలు ముమ్మర కసరత్తు ప్రారంభించి..

పట్టభద్రుల స్థానంపై పట్టుకోసం ప్రయత్నం

తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు ముగిసినా మరో ఎన్నికకు ప్రధాన పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. అదే ఈ నెల చివరన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మూడు జిల్లాల నేతలతో మూడు పార్టీలు ముమ్మర కసరత్తు ప్రారంభించి.. పట్టభద్రుల స్థానంపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల సమరం సమాప్తమైన ఎన్నికల మోడ్ మాత్రం పోలేదు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హడావుడి మొదలైంది. పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఎమ్మెల్సీ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి చింతపండు నవీన్ మల్లన్న, బిఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బిజెపి తరపున ప్రేమెందర్ రెడ్డి బరిలో ఉన్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బిఆర్ఎస్ ప్రయత్నాలు గట్టిగా చేస్తోంది. ఈ నెల 27 న ఎమ్మెల్సీ బై పోల్ జరగనుండటంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రధాన పార్టీలు పని ప్రారంభించాయి.






## రాజకీయాలు పక్కనబెట్టి..

# రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయండి

- ఒకవైపు టీచర్లపై దాడి.. మరోవైపు విద్యుత్ ఉద్యోగులపై నిందలు..
- సీఎం చేయాల్సిన పని ఇదేనా.. కేటీఆర్ ఫైర్
- తన దగ్గర పనిచేసే ఉద్యోగులతో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేయించుకోవాలి.. ప్రజలకు సేవ చేయాలి

హైదరాబాద్

ఒకవైపు టీచర్లపై లాఠీ ఛార్జీలు, మరోవైపు విద్యుత్ సంస్థ ఉద్యోగులపై నిందలు.. ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పని ఇదేనా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తన దగ్గర పనిచేసే ఉద్యోగులతో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేయించుకోవాలని.. ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఆ పనిచేయకుండా -మిగతా3లో

# ఆడవాళ్ల కదలికపై మీకెందుకంత ఆసక్తి?





**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో మాత్రమే గాంధీ కుటుంబసభ్యులు అమేథి, రాయబరేలి నియోజకవర్గాల్లో పర్యటిస్తారంటూ కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఆరోపణలపై కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాకం గాంధీ వాద్రా ఘాటుగా విమర్శించారు. ఆయన వాదన సత్యదూరమని అన్నారు. మహిళల కార్యకలాపాలపై అమిత్‌షా నిఘా వేయడం ఏమిటని నిలదీశారు. థాయ్‌లాండ్‌లో తాను పర్యటించిన సమాచారాన్ని ఆయన ఎలా సేకరించారని ప్రశ్నించారు. అమిత్ షా గత ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమేథీ, రాయబరేలి నియోజకవర్గాలను గతంలో అక్కడి నుంచి గెలిచిన గాంధీ ఫ్యామిలీ నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఆ నియోజకవర్గాల్లో గెలిచిన తర్వాత సోనియాగాంధీ, ఆమె కుటుంబం ఎన్నిసార్లు ప్రజలను చూసేందుకు వచ్చారు? అని ప్రశ్నించారు. సోనియాగాంధీకి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, రాహుల్, ప్రియాంక గాంధీ మాటేమిటని నిలదీశారు. గతంలో రాయబరేలి నియోజకవర్గంలో పలు దురదృష్టకర సంఘటనలు జరిగినా గాంధీ కుటుంబసభ్యులు వచ్చిన దాఖలాలు లేవన్నారు.

**తిప్పికొట్టిన ప్రియాంక..**

హెూం మంత్రి ఆరోపణల్లో నిజం ఏమాత్రం లేదని, మహిళల కార్యకలాపాలపై ఆయన నిఘా వేస్తుంటారని ఆరోపించారు. "ముఖ్యంగా మహిళలతో సహా ఎవరు ఏం చేస్తున్నారు? ఎప్పుడు, ఎక్కడ ఉన్నారు? అనే దానిపై ఆయన దృష్టి సారిస్తుంటారు. నేను కొద్ది రోజుల క్రితం నా కుమార్తెను చూసేందుకు థాయ్‌లాండ్ వెళ్లాను. ఎన్నికల మీటింగ్‌లో ఆయన (అమిత్‌షా) ఈ ప్రస్తావన చేశారు. అవును...నేను థాయ్‌లాండ్ వెళ్లాను. అయితే ఈ సమాచారం ఆయనకు ఎవరు ఇచ్చారో చెప్పగలరా? ఆయన దగ్గర సమాచారం ఉన్నప్పుడు అబద్ధాలు చెప్పాల్సిన పనేంటి?" అని ప్రియాంక నిలదీశారు.

**కాంగ్రెస్ చాలా చేసింది..**

కాంగ్రెస్ హయాంలో అనేక ప్రాజెక్టులు పూర్తి చేసినట్టు ప్రియాంక తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గంగా బ్రిడ్జి, ఎయిమ్స్, నిఫ్ట్, ఎఫ్‌డీడీఐ, లక్నో నుంచి రాయబేరిలికి 4 లేన్ రింగ్ రోడ్డు, ఐదు నేషనల్ హైవేలు ఇచ్చిందన్నారు. మోటార్ డ్రైవింగ్ స్కూలు తాము ప్రారంభిస్తే వాళ్లు మూసేశారని చెప్పారు. స్పైస్ పార్క్, ఎయిమ్స్ ప్రారంభిస్తే దానిని కూడా వారు మూసివేయించారని చెప్పారు. 8 ఫ్లైఓవర్లు, కోవిడ్ మహమ్మారి సమయంలో ఎంపీలాడ్స్ ద్వారా సాయం, రైల్వే వాషింగ్ లైన్, రైల్వేస్టేషన్ల మాడిఫికేషన్, 10 రైల్వే అండర్‌పాస్, కేంద్ర నిధులతో రాయబేరి నుంచి దల్‌మవు వరకూ రోడ్డు నిర్మాణం వంటివి తాము చేపట్టామని చెప్పారు. రాబయరేలికి బీజేపీ ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. కాగా, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ, రాయబరేలిలో ఎన్నికల ప్రచారానికి ప్రియాంక గాంధీ సారథ్యం వహిస్తున్నారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలిలో పోలింగ్ జరుగనుంది.

# మోదీని సాగనంపడం ఖాయం



**లక్నో:** 'ఇండియా' కూటమి జూన్ 4న కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ఇంతవరకూ పూర్తయిన నాలుగు విడతల పోలింగ్‌లో విపక్ష కూటమి స్ట్రాంగ్ పొజిషన్‌లో నిలిచిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని సాగనంపడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడటానికి ఈ ఎన్నికలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ లక్నోలో బుధవారంనాడు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని పరిరక్షించ^డానికి మనమంతా కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యం లేకపోతే అరాచకత్వం, నియంతృత్వం రాజ్యమేలుతుంది. బీజేపీకి చెందిన బడానేతలు ఎక్కడ పోటీచేసినా అక్కడ విపక్ష నేతలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఒక ఘటన చూశాను. బీజేపీకి చెందిన మహిళా అభ్యర్థిని ఒకరు బురఖాలు తొలగించి మహిళల ఐడెంటిటీని తనిఖీ చేశారు. దీనిని స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడమని అంటారా?" అని ఖర్గే ప్రశ్నించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పేద ప్రజలకు ప్రతినెలా 10 కిలోల ఉచిత రేషన్ అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలకు తాము అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఐదు కిలోల రేషన్ ఇస్తున్నామంటూ కొందరు మాట్లాడుతున్నారని, అసలు ఆహార భద్రతా చట్టం తెచ్చిందే తామని గుర్తు చేశారు. ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 10 కిలోల రేషన్ ఇవ్వడం ఖాయమన్నారు. కర్ణాటక, తెలంగాణలో తాము ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పారు.

**యూపీలో 79 సీట్లు ఇండియా కూటమికే..**

జూన్ 4వ తేదీతో పత్రికా స్వేచ్ఛకు స్వర్ణయుగం రానుందని, ఇందుకు మీడియాకు అభినందనలు తెలియచేయాలని అనుకుంటున్నానని అఖిలేష్ యాదవ్ అన్నారు. బీజేపీ ప్రతికూల కథనాలతో తనంత తానుగా ఉచ్చులో చిక్కుకుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి 79 సీట్లు గెలుచుకోవడం ఖాయమని, కేవలం ఒక్క సీటులోనే పోటీ ఉందని చెప్పారు.

## రూ.91 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపిన కంగనా రనౌత్

**రూ.62.92 కోట్ల స్థిరాస్తులు, రూ.28.73 కోట్ల చరాస్తులు కలిగి ఉన్నట్లు వెల్లడి**


**ముంబై, పంజాబ్, మనాలీలో తన ఆస్తులు ఉన్నాయన్న కంగనా**

**సొంతంగా తనకు బీఎండబ్ల్యూ 7 సిరీస్ సహా మూడు లగ్జరీ కార్లు ఉన్నట్లు తెలిపిన కంగనా రనౌత్**



హిమాచల్ ప్రదేశ్ మండి లోక్ సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సినీ నటి కంగనా రనౌత్ తన ఆస్తులను వెల్లడించారు. రూ.91 కోట్ల విలువచేసే ఆస్తులు తన పేరిట ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అఫిడవిట్ వివరాల ప్రకారం, రూ.62.92 కోట్ల స్థిరాస్తులు, రూ.28.73 కోట్ల చరాస్తులు కలిగి ఉన్నట్లు వెల్లడించారు. తన చేతిలో నగదు రూపంలో రూ.2 లక్షలు ఉన్నట్టు వెల్లడించారు. రూ.1.35 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ ఉందని తెలిపారు. ముంబై, పంజాబ్, మనాలీలో తన ఆస్తులు ఉన్నాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల 12 లక్షల పైచిలుకు ఆదాయం పన్నుగా చెల్లించినట్లు తెలిపారు. సొంతంగా తనకు బీఎండబ్ల్యూ 7 సిరీస్ సహా మూడు లగ్జరీ కార్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద రూ.5 కోట్ల విలువైన 6.70 కిలోల బంగారం ఉందని, రూ.5 లక్షల విలువైన 60 కిలోల వెండి ఉందని, రూ.3 కోట్ల విలువైన 14 క్యారెట్ల డైమండ్స్ ఉన్నట్లు వెల్లడించారు. 50 ఎల్ఐసీ పాలసీలు ఉన్నట్లు తెలిపారు.

## ఢిల్లీ మద్యం పాలసీ కేసు.. మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు మరో సారి పొడిగించింది. ఈ నెల 30 వరకు కస్టడీని పొడిగించి. నేటితో కస్టడీ ముగియడంతో పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చింది. సిసోడియా ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో తిహార్ జైలులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన తీహార్ జైల్లో ఉన్నారు. సిసోడియాను ఈడీ అధికారులు వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారణ మళ్లీ అదే రోజున జరుగనున్నది. ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా సిసోడియాపై ఉన్న అభియోగాలపై వాదనలను కోర్టు వాయిదా వేసింది. చార్జి ఫ్రేమింగ్‌పై విచారణ ప్రారంభించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ 24న జరుపనున్నది. సీబీఐకి సంబంధించిన కేసులో సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఈ నె 7న కోర్టు కస్టడీని 15 వరకు కోర్టు పొడిగించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో అక్రమాలు జరిగాయని సీబీఐ, ఈడీలు.. ఇందులో ప్రధాన కుట్రదారు సీఎం అరవింద్ కేజ్రీవాల్ అని ఈడీ ఆరోపించింది. ఇందులో చాలామంది ఆప్ నేతల ప్రమేయం ఉందని పేర్కొంది. అయితే, ఆరోపణలు నిరాధారమని ఆప్ పార్టీ పేర్కొంది. మద్యం పాలసీ కేసులో గత ఏడాది మార్చి 9న ఈడీ మనీశ్ సిసోడియాను అరెస్ట్ చేసింది. నాటి నుంచి తీహార్ జైలులోనే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# స్మార్ట్‌ఫోన్ యూజర్లకు కేంద్రం కీలక హెచ్చరిక!

స్మార్ట్‌ఫోన్ యూజర్లకు కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లోని లోపాలతో ఫోన్ హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. ఆయా లోపాలను ఆసరా చేసుకొని హ్యాకర్స్ సులభంగా ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని వ్యక్తిగత డేటాను ఆసరా చేసుకొని హ్యాకర్స్ చాలా సులభంగా ఫోన్‌ను కంట్రోల్‌లోకి తీసుకోవచ్చుని.. డేటాను తస్కరించే అవకాశం ఉందని చెప్పింది. ఫ్రేమ్‌వర్క్, సిస్టమ్, గూగుల్ ప్లే సిస్టమ్ అప్‌డేట్‌లు, కెర్నల్, కెర్నల్ ఎల్‌టీఎస్, మీడియాటెక్ కాంపోనెంట్‌లు, ఆర్మ్ కాంపోనెంట్‌లు, క్వాల్ కామ్ కాంపోనెంట్‌లతో సహా సిస్టమ్‌లోని వివిధ భాగాలలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. దీన్ని అడ్డుకునేందుకు ఇండియన్ స్మార్ట్ ఆండ్రాయిడ్ యూజర్స్‌కి అప్‌డేట్‌ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే మొబైల్‌ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. దేశంలో చాలావరకు స్మార్ట్ మొబైల్స్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తోనే పని చేస్తున్నాయని సీఈఆర్టీ- ఇన్ చెప్పింది. ఇప్పటికీ పాత వెర్షన్‌లోనే ఉన్న స్మార్ట్ ఫోన్స్‌లోకి హ్యాకర్స్ సులభంగా ప్రవేశించి.. యూజర్‌కి తెలియకుండానే అందులోని విలువైన సమాచారాన్ని తస్కరిస్తారని పేర్కొంది. ఇవి ఆండ్రాయిడ్ యూజర్ల ప్రైవసీకి ముప్పుగా పరిణమిస్తాయని.. హానికరమైన సాఫ్ట్‌వేర్‌ని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసే అవకాశం లేకపోలేదని హెచ్చరించింది. ఆండ్రాయిడ్ 12, ఆండ్రాయిడ్ 12ఎల్, ఆండ్రాయిడ్ 13, ఆండ్రాయిడ్ 14.. వెర్షన్లు వాడుతున్న స్మార్ట్‌ఫోన్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలని.. కొత్త వెర్షన్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. సైబర్ మోసాల ప్రమాదాన్ని తగ్గించడానికి, స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు వెంటనే తమ పరికరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

## 'ఇండియా' కూటమికి బయట నుంచి తాము మద్దతిస్తాం



**కోల్‌కతా:** విపక్ష 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ పశ్చిమబెంగాల్ లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు విషయంలో తమ మద్దతుపై స్పష్టత ఇచ్చారు. హుగ్లీ జిల్లాలోని చిన్‌సురహ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, బీజేపీ 400 సీట్లు గెలుస్తామని చెబుతున్నప్పటికీ ఈసారి అది జరగదని ప్రజలు చెబుతున్నారని అన్నారు., కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు 'ఇండియా' కూటమికి బయట నుంచి తాము మద్దతిస్తామని తెలిపారు.

**ఈసీపై మండిపాటు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో ఎన్నికల కమిషన్ ఒక కీలుబొమ్మలా పనిచేస్తోందని మమతా బెనర్జీ విమర్శించారు. రెండున్నర నెలల పాటు ఎన్నికల షెడ్యూల్ ఉండటాన్ని తప్పుపడుతూ కాషాయం పార్టీకి అనుకూలంగా ఈసీ వ్యవహరించిందన్నారు. మండుటెండల్లో ప్రజలు పడే కష్టాలు ఎన్నికల అధికారులకు తెలియవా అని ప్రశ్నించారు.

**ఎంసీసీ ఉల్లంఘనకు పాల్పడిన మోదీ**

లోక్‌సభ ఎన్నికలు మధ్యలో ఉండగా ఆయుష్మాన్ భారత్ యోజనను 70 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లకు వర్తింపజేసే ఆలోచన ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. ఓవైపు ఎన్నికలు జరుగుతుండగా మోదీ కీలక ప్రకటన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇది కచ్చితంగా ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. బెంగాల్‌లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్‌సీ), ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసే ప్రసక్త లేదని, ఇందుకు తాము కట్టుబడి ఉంటామని బెనర్జీ పునరుద్ఘాటించారు.

## బిజీ బ్రిడ్జిపై నావికా దళ అధికారికి గుండెపోటు : ట్రాఫిక్ కానిస్టేబుల్ చొరవతో నిలిచిన ప్రాణం



నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే బ్రిడ్జిపై నావికా దళ అధికారి గుండెపోటుతో కుప్పకూలగా ట్రాఫిక్ కానిస్టేబుల్ చొరవతో ప్రాణాలు దక్కాయి. ముంబైలోని శాంతాక్రజ్ వెస్ట్ ఏరియాలోని వకోలా బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. నావికా దళ అధికారి ప్రశాంత్ రాయ్ తన సహచరులతో కలిసి పోవై నుంచి వొర్లికి తన కారులో వెళుతుండగా ఛాతీ నొప్పితో కుప్పకూలారు. ఈ క్రమంలో ఆయన సహచరులు సమాచారం అందించడంతో ఆన్‌డ్యూటీ కానిస్టేబుల్ శ్రీకాంత్ నవ్లే కొద్దిసేపు వాహనాలను నిలిపివేసి తన బైక్‌పై వారి కారుకు దారి చూపుతూ కేవలం ఐదు నిమిషాల్లోనే అక్కడికి సమీపంలోని వీఎన్ దేశాయ్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో వీఐపీల రాకపోకలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం కష్టతరమైందని నవ్లే చెప్పారు. నేవీ అధికారి గుండెపోటుకు గురైన కొద్దినిమిషాలకే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు.

## కాంగ్రెస్ హయాంలో వరుస బాంబు పేలుళ్లు




ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కశ్మీర్‌లో పరిస్థితిని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా మార్చివేసిందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. సోనియా-మన్మోహన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో బాంబు పేలుళ్లు జరిగాయని అమిత్ షా గుర్తుచేశారు. ఉగ్రదాడులు జరిగినా అప్పటి యూపీఏ ప్రభుత్వం దీటుగా బదులివ్వలేదని, తమ ఓటు బ్యాంక్ కోల్పోతామనే భయంతో మౌనంగా ఉందని ఆరోపించారు. తాము ఉగ్రవాదుల పట్ల కఠిన వైఖరితో వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. బిహార్‌లో ఎన్డీయే కూటమి మెరుగైన ఫలితాలు సాధిస్తుందని, గతంలో వచ్చిన ఫలితాలు పునరావృతమవుతాయని అన్నారు. శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీకి దూరంగా ఉండటంపై ఆయన స్పందించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బీజేపీ బలంగా లేదని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీ బలోపేతమైన అనంతరం ఎన్నికల బరిలో నిలుస్తామని, ఆపై విజయం సాధిస్తామనే విశ్వాసం తనకు సంపూర్ణంగా ఉందని చెప్పారు. 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారని స్పష్టం చేశారు. 2029 తర్వాత కూడా మోదీయే తమ నాయకుడిగా ఉంటారన్నారు. బెంగాల్‌లో జరుగుతున్న దౌర్జన్యాలపై హైకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని... వారి వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. సందేశ్‌కాళీ ఘటన విషయంలో మమతా బెనర్జీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మత ప్రాతిపదికన మహిళలపై బెంగాల్‌లో దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు.

# కమలనాథుల కదనోత్సాహం

-మొదటి పేజి తరువాయి


చేవెళ్లలో హేమాహేమీలను బరిలోకి దింపడంతో విజయం ఖాయమనే నిర్ణయానికి వచ్చారు.

**సికింద్రాబాద్‌లో కమలమేనా..!!**

సిట్టింగ్ స్థానమైన సికింద్రాబాద్‌ను మరోసారి కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉన్నారు. 1991, 98, 99, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. కిషన్‌రెడ్డి రెండో సారి మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీ ఉన్నా మోదీ హవా కలిసి వచ్చిందని అంటున్నారు. మరో వైపు బీఆర్ఎస్ ఓటింగ్ కూడా బీజేపీకి పడినట్లు అంచనా వేస్తున్నారు.

**మల్కాజిగిరిలో గెలుపుపై ఆశ**

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ గెలుపు తథ్యమని పార్టీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. మొదటి నుంచి మల్కాజిగిరి స్థానంపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. పోలింగ్ సరళి చాలా ప్రాంతాల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. విద్యాధికులు, కాలనీ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. మరో వైపు ఈటల రాజేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేయడం పార్టీకి కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు.




**హైదరాబాద్‌లో సత్తా చూపుతుందా..!!**

ప్రతి ఎన్నికలో పాతబస్తీలో కమలం సత్తా నిరూపించుకునేందుకు ప్రయత్నం చేసింది. జనసంఘుగా ఉన్నప్పటి నుంచి హైదరాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్నది. ఈసారి ఇక్కడి నుంచి బీజేపీ తరపున మాధవీలత పోటీలో ఉన్నారు. గతంలో కంటే ఎక్కువ ఓట్లు బీజేపీకి వస్తాయని ఆశతో ఉన్నారు. పది వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని అభ్యర్థి మాధవీ లత ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పట్టున్న గోషామహల్, కార్వాన్‌లో ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని పార్టీ అంచనా వేస్తున్నది. చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురాలో కూడా బీజేపీకి ఓట్లు అధికంగానే పడ్డాయని అంచనా వేస్తున్నారు. గతంలో వచ్చిన ఓట్ల కంటే ఈసారి ఎక్కువగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈసారి హైదరాబాద్‌లో పోలింగ్ శాతం ఎక్కువ నమోదు కావడం తమకు లాభిస్తుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

# రాజకీయాలు పక్కనబెట్టి.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయండి

-మొదటి పేజి తరువాయి

ప్రతిపక్షాలను నిందిస్తే ఏమొస్తుందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య ఉన్న తేడాను వివరించారు.

కేసీఆర్ పదేండ్లు ప్రభుత్వాన్ని నడిపినప్పటికీ.. ఎన్నాడూ ఒక్క పొల్లు మాట కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గురించి ఒక పొల్లు మాట్లాడలేదని కేటీఆర్ తెలిపారు. ఎందుకంటే వాళ్లతో తమకు ఉన్నది పేగు బంధమని స్పష్టం చేశారు. ఉద్యమంలో కలిసి పనిచేశామని.. సకల జనుల సమ్మె చేసినా.. పెన్ డౌన్ చేసినా.. సింగరేణిలో స్తంభింపజేసినా.. ఆర్టీసీలో చక్రం తిప్పకుండా ఆపినా.. ఉద్యోగులతో బీఆర్ఎస్ పార్టీకి ఉండేది పేగుబంధమని తెలిపారు. అందుకే ఉద్యోగుల పట్ల కుదిరితే ప్రేమపూర్వకంగా ఉన్నాం తప్ప నిందించలేదని స్పష్టం చేశారు. అదే రేవంత్ రెడ్డి తన అసమర్థతను, తన ప్రభుత్వ చాతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు విద్యుత్ సంస్థ ఉద్యోగులను నిందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను కేసీఆర్.. 7700 మెగా వాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచారని కేటీఆర్ తెలిపారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల కష్టం అద్భుతంగా ఉంది కాబట్టే అక్కడి నుంచి ఇక్కడిదాకా వచ్చామని పేర్కొన్నారు. అది గుర్తించకుండా.. కామన్‌సెన్స్ లేకుండా తమ చాతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి, పదేండ్లు కేసీఆర్ ప్రభుత్వంలో కరెంటు కోతలు లేకుండా బ్రహ్మాండంగా, ఏ ఉద్యోగులు అయితే కర్తవ్యాన్ని నిర్వర్తించారో.. వాళ్లను నిందిస్తూ ముఖ్యమంత్రి చిల్లర రాజకీయాలకు పాల్పడతున్నారని విమర్శించారు. ఆయన విజ్ఞతతో ఆలోచించాలని సూచించారు. ముఖం బాగోలేక పోతే.. అద్దం పగలగొట్టినట్లుగా ముఖ్యమంత్రి తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వాన్ని అయితే కేసీఆర్ సమర్థంగా నడిపారో.. ఏ డిస్కంలను అయితే నడిపారో.. శ్రీశైలంలో పంప్‌హౌజ్ మునిగిపోతే కూడా, నష్టం జరిగితే కూడా అహర్నిశలు ఇదే ఉద్యోగులను శ్రమించారన్నారు. విద్యుత్ ఉద్యోగులను నిందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను అవమానించడం తగదన్నారు. ఇకనైనా తాను ముఖ్యమంత్రిని అనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటే మంచిదని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాగే గావుకేకలు, పెడుబొబ్బలు పెట్టారని తెలిపారు. అప్పుడు పోలీసులను తిట్టిండు అని.. ఉద్యోగులను తిట్టిండని.. కొంతమంది తొత్తులు అని విమర్శించారని గుర్తు చేశారు. ఐఏఎస్ అధికారులను



తిట్టారని.. బిహారీ గ్యాంగులు అంటూ తిట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అవే దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి.. ముఖ్యమంత్రిలా మాట్లాడాలని సూచించారు.

తన కింద పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులను ఒక ప్రభుత్వ అధినేత నమ్మకపోవడం దారుణమని కేటీఆర్ అన్నారు. నారాయణఖేడ్‌లో టీచర్ల మీద దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలింగ్ డ్యూటీ చేసినందుకు దానికి సరిపడా వేతనం ఇవ్వాలి. అది ఇవ్వకపోగా.. అడిగినందుకు వాళ్ల మీద లాఠీ ఛార్జీలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు టీచర్లపై లాఠీ చార్జీలు, విద్యుత్ ఉద్యోగులపై నిందలు.. ఇది కరెక్టేనా.. ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పని ఇదేనా అని మండిపడ్డారు. ప్రభుత్వం తన దగ్గర పనిచేసే ఉద్యోగులతో సమర్థవంతంగా పనిచేయించుకోవాలి.. ప్రజలకు సేవ చేయాలి.. ఆ పనిచేయకుండా ప్రతిపక్షాలను నిందిస్తే ఏమొస్తుందని ప్రశ్నించారు.

**రాజకీయాలు పక్కనబెట్టి..**
**రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయండి**

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయకుండా, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనబెట్టి.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం అనంతరం.. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని.. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

క్వింటాలుకు మూడు, మూడున్నర కిలోల తరుగు తీసేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. తరుగు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏమేమీ మాట్లాడారో సామాజిక మాధ్యమాల్లో ఉన్నాయని అన్నారు. ఆనాడు వాళ్లు చెప్పిన దాని ప్రకారం.. ఎట్టిపరిస్థితుల్లో రైతుకు అన్యాయం చేయకుండా.. తరుగు లేకుండా ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని కామారెడ్డి జిల్లా, నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చందాలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ధాన్యం బస్తాలతోనే నిరసన తెలిపారని తెలిపారు. వరంగల్ జాతీయరహదారిపై ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో వరిధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ధర్నా చేశారని చెప్పారు. కేవలం నాలుగు జిల్లాలల్లో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల రైతులు గత 25, 30 రోజులుగా ధాన్యం తెచ్చిన తర్వాత కూడా కొనుగోలు చేయకుండా, అధికారులు పట్టించుకోకపోవడంతో దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనబెట్టి.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా దాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తరుగు లేకుండా కొనుగోలు చేయాలని.. వెంటనే కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతన్నల తరఫున ప్రశ్నించడమే కాకుండా.. అవసరమైతే రోడ్డెక్కి.. పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని టీఆర్ హెచ్చరించారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని.. మీ తరఫున కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ యంత్రాంగం మొత్తం ఉందని ధైర్యం చెప్పారు. రైతులు ఎప్పుడు పిలిచినా.. ఎక్కడికి పిలిచినా వస్తామని అన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు వాళ్ల తరఫున ఉంటామని తెలిపారు. రైతులకు రుణమాఫీ జరిగే వరకు, పంట బోనస్ వచ్చే వరకు, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ప్రజల తరఫున, రైతుల తరఫున నిలబడి మాట్లాడతామని తెలిపారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఎవరూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.

# టీచర్ల ప్రమోషన్‌కు టెట్ గండం

**హైదరాబాద్ :** పార్లమెంటు ఎన్నికల అనంతరం ప్రభుత్వం ప్రమోషన్లు కల్పిస్తుందని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు టెట్ గండంగా మారింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనలను అనుసరించి టెట్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రమోషన్లకు అర్హులు అన్న నిబంధన ఉపాధ్యాయుల పదోన్నతుల ఆశలపై నీళ్లు చల్లిందనడంలో అతిశయోక్తి లేదు. టీచర్ల పదోన్నతి, బదిలీల వ్యవహారం. ఉపాధ్యాయేతర ఉద్యోగులు క్రమంగా పదోన్నతులు పొందుతూ ఉన్నత స్థానాలకు చేరుతుంటే టీచర్లు మాత్రం కోర్టు కేసుల నేపథ్యంలో, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సుదీర్ఘకాలం ఎటువంటి పదోన్నతి లేక ఉన్న కేడర్లోనే పదవీ విరమణ చేస్తుండడం విచారకరం. పై కేడర్ ప్రమోషన్కు సంబంధించిన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ దశాబ్దంపైగా జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్, ఎంఈఓ, డిప్యూటీ ఈవో వంటి తదితర పోస్టులతో పాటు పాఠశాల స్థాయి హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా ప్రమోషన్లు పొందలేకపోవడం శోచనీయం. ఉన్నత పాఠశాలల్లో చాలా చోట్ల హెడ్మాస్టర్ల పోస్టులు ఖాళీగా ఉండి ఇంచార్జీల పాలనలో స్కూల్స్ నడవడం, సబ్జెక్టు టీచర్ల కొరత ఉండడం వల్ల పిల్లలు ఆయా సబ్జెక్టులలో బోధన అందకపోవడం వంటి బోధనాపరమైన సమస్యలతో పాఠశాల విద్య సతమతమవుతున్నది. హైస్కూల్ స్థాయి పోస్టుల వరకు మేనేజ్ మెంట్ వారీగా పదోన్నతులు ఇవ్వడానికి, బదిలీలు నిర్వహించడానికి ప్రభుత్వం అంగీకరించి ప్రక్రియ ప్రారంభించింది. ఎనిమిది సంవత్సరాల తరువాత గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వం పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేసింది. జోన్-1లో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ వరకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం కోర్టు కేసుల మూలంగా జోన్-2లో పదోన్నతుల ప్రక్రియను నిలిపివేసింది. న్యాయస్థానం నుంచి పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో ప్రభుత్వం ఎన్నికల తదుపరి పదోన్నతులు కల్పిస్తుంది అనుకుంటే ఇప్పుడు టెట్ అడ్డంకిగా మారింది. ఇప్పుడు రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉండి ఈ వయస్సులో టెట్కు సంసిద్ధులు కావడం సీనియర్లకు అసాధ్యం. పైగా ఇన్నేళ్లుగా ఏదో ఒక సబ్జెక్టుకు పరిమితమై ఆ సబ్జెక్టును బోధిస్తున్నవారు ఇప్పుడు అన్ని సబ్జెక్టులు అధ్యయనం చేయడం వాటిలో జ్ఞాన సముపార్జన చేయడం సాధ్యంకాని పని. ఇప్పుడు అకస్మాత్తుగా ఇంగ్లీషు, సైన్సు, గణితం, సోషల్ సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని వాటిలో పరీక్ష రాయడం ఉత్తీర్ణత చెందడం గగన కుసుమమేనని చెప్పక తప్పదు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించే ప్రతివారు టెట్ అర్హత సాధించాలని నిబంధనను 2010లో విధించింది. ఈ నిబంధనను కేవలం ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించేవారికే గాక ఇన్ సర్వీసు టీచర్లకు కూడా వర్తింపజేయడంతో సర్వీస్ టీచర్లకు తిప్పలు తప్పడం లేదు. అయితే అప్పటి మన రాష్ట్ర ప్రభుత్వం 2015 లో ఉత్తర్వుల సంఖ్య.36 ను విడుదల చేస్తూ 2010 కంటే ముందు నియామకం పొందిన టీచర్లకు టెట్ మినహాయింపు ఇస్తున్నట్టు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నది. 2015 నుంచి 2023 వరకు విడుదలైన ప్రతి టెట్ నోటిఫికేషన్లో 2010 కంటే ముందు నియామకం పొందిన టీచర్లకు టెట్ మినహాయింపు విషయాన్ని ప్రస్తావిస్తూ వచ్చారు. దానితో సీనియర్ టీచర్లు ఎవరు కూడా టెట్ గురించి ఆలోచించలేదు. ఇటీవల హైకోర్టు టెట్ అర్హతను తప్పనిసరి చేస్తూ ఇచ్చిన తీర్పును అనుసరించి ప్రభుత్వ విద్యాశాఖ 2024లో విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్లో మినహాయింపు విషయాన్ని తొలగించింది. అయితే 2010కి ముందు నియామకమైన టీచర్లకు ప్రమోషన్ల కొరకు టెట్ అవసరం లేదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడం కోసంమెరుపు. ఆ తీర్పు నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం ఎన్.సి.టి.ఈ నుండి అనుమతి తీసుకుని ఇన్ సర్వీస్ టీచర్లలో 2010 కంటే ముందు నియామకం పొందినవారికి టెట్ నుండి మినహాయింపు ఇచ్చి వెంటనే పదోన్నతులు బదిలీలు చేపట్టాలి. ఎస్జీటీ, ఎల్.ఎఫ్.ఎల్ హెచ్ఎం రెండు కూడా ఒకే లెవెల్ పోస్టులు కాబట్టి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ప్రమోషన్ కు టెట్ అవసరం ఉండదని, అలాగే భాషా పండితులుగా నియామకం పొందిన టీచర్లు పనిచేస్తున్న లెవెల్ హై స్కూల్ స్థాయి కాబట్టి వారికి కూడా టెట్ అవసరం లేదని, స్కూల్ అసిస్టెంట్ లు పనిచేసేది కూడా హై స్కూల్ స్థాయే కాబట్టి వారికి టెట్ ఉత్తీర్ణత అవసరం లేదన్న వాదనలు వినిపిస్తున్నా నేటికీ ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. 2010 కంటే ముందు నియామకం పొంది, సీనియారిటీ ఉండి పదవీ విరమణకు చేరువగా ఉన్న టీచర్ల పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం వారికి టెట్ నుండి మినహాయింపు

## మజ్లిస్ రిగ్గింగ్ చేసింది... అవసరమైతే ఎంత దూరమైనా వెళతా: హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత

**రిగ్గింగ్ ఆపేందుకు తాను వెళితే తనపై దాడికి యత్నించారన్న మాధవీలత**

**ఎన్నికల రోజు మతతత్వాన్ని ఎవరు తీసుకువచ్చారని ప్రశ్నించిన మాధవీలత**

**అవసరమైతే రీపోలింగ్ పెట్టించుకుంటామని వ్యాఖ్య**



హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో రిగ్గింగ్ జరిగిందని... ఈ రిగ్గింగ్‌పై అవసరమైతే తాను ఎంత దూరమైనా వెళతానని ఈ లోక్ సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. 16 ఏళ్ల బాలిక రెండోసారి ఓటు వేసేందుకు వచ్చి దొరికిపోయిందన్నారు. పాతబస్తీలో భారీగా రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ఈ రిగ్గింగ్ ఆపేందుకు తాను వెళితే తనపై దాడికి యత్నించారన్నారు. ఆ పక్కనే పోలీసులు ఉన్నా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్లిస్ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. ఒక ఓటు పూర్తవడానికి మిషన్ కాస్త సమయం తీసుకుంటుందని... అటువంటిది చివరలో ఓటింగ్ శాతం ఒక్కసారిగా ఎలా పెరిగింది? అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల రోజున మతతత్వాన్ని ఎవరు తీసుకువచ్చారని ప్రశ్నించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎంఐఎం నినాదాలు చేయడం ఎంత వరకు న్యాయమన్నారు. హైదరాబాద్ నియోజకవర్గంలో మజ్లిస్ గెలవదన్నారు. వారు రిగ్గింగ్ చేశారని... అవసరమైతే రీపోలింగ్ పెట్టించుకుంటామన్నారు. న్యాయం, నిజాయతీ, ధర్మం తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం



-మొదటి పేజి తరువాయి

రానున్న రోజుల్లో తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. తెలంగాణలో ఒక్క బస్సు పథకం మాత్రమే నడుస్తుందని.. దానికి ఆర్టీసీకి నిధులు చెల్లించడం లేదని అన్నారు. మహిళలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ. 12 వేలు, తులం బంగారం అన్నారని.. వాటిని కూడా ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. 420 హామీలు రేవంత్ రెడ్డి ఇచ్చారని.. ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఎన్నికల ముందు మోదీని విమర్శించారని చెప్పారు. ప్రజలు జూన్ 4న ఇచ్చే ఫలితం ఏ రకంగా ఉండబోతుందో చూస్తారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలని ప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నీచమైన రాజకీయాలు దిగజారాకుండా రేవంత్ రెడ్డి వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గడ్డుకాలంలో ఉందన్నారు. ఆర్థిక వనరుల సమీకరణ ఏవిధంగా చేయబోతున్నారో రేవంత్ చెప్పాలన్నారు. హామీలపై కాంగ్రెస్ వైఖరి ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రానికి వచ్చారని.. ఆ హామీలు నెరవేర్చకుండా.. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు కూడా కొత్త హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తాము పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్తామని అన్నారు. మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్‌లో బీజేపీకి కొంత ఓట్ల శాతం తగ్గిందని చెప్పారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు కొన్ని ఓట్లను కాంగ్రెస్ కుట్రతో తీసేసిందని ఆరోపించారు. రేపు ఎన్నికల కమిషన్‌కి బీజేపీ మద్దతు దారుల ఓట్లు తీసేయడంపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం ఉండదని.. ఓటర్ కార్డును ఆధార్‌కి లింక్ చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు

## గెలుపుపై ధీమా...
## ఎవరి లెక్కలు వారివే

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో చెదురుమదురు సంఘటనల మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొన్ని నియోజకరవర్గాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది గతంలో కంటే ఎక్కువగా పోలింగ్ నమోదు అవుతున్నట్లు ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల మినహా మిగతా చోట్ల పోలింగ్ అనుకున్నదానిపై ఎక్కువగానే నమోదైనట్టు ఓ అంచనా. మహిళలు, యువత ఈసారి ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారని రాజకీయ పార్టీల అంచనా. గెలుపుపై నేతలు ఎవరి అంచనాల్లో వారు నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహిళలు, యువత ఓట్లు తమకే లభిస్తుందని ఫ్యాన్ పార్టీ అంచనాల్లో నిమగ్నమైంది. ఎన్నికల ముందు వై నాట్ 175 స్లోగన్ ఇచ్చిన అధికార పార్టీ, పోలింగ్ తర్వాత 110 సీట్ల వస్తాయని అంచనా వేసింది. రిజల్ట్ తర్వాత ఎంత అన్నది చూడాలి. స్వతహాగా అధికార పార్టీ మాత్రం తామే గెలుస్తామని చెప్పడం సహజం. ఎన్నికల్లో కచ్చితంగా తామే గెలుస్తామని కుండబద్దలు కొట్టేశారు ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. వందకు పైగానే సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేశారాయన. ఓటింగ్ శాతం పెరిగితే.. ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉందని అంటారు. ఏపీలో ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందన్న సంకేతాల నేపథ్యంలో తనదైన శైలిలో జోస్యం చెప్పేశారు సజ్జల. ప్రభుత్వానికి సానుకూలత వల్లే ఓటింగ్ శాతం పెరుగుతోందని వివరించారు. ఇదే సజ్జల 2019 ఎన్నికల్లో మరోలా విశ్లేషించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని, తమ విజయం తమవైపేనన్నారు. ఆయన అంచనాల ప్రకారం చూస్తే ఇప్పుడు వైసీపీ గెలుస్తుందా అన్నదే అసలు ప్రశ్న. ఇక టీడీపీ విషయానికొద్దాం? ఓటింగ్ సరళి చూస్తుంటే అన్నివైపులా తమకే అనుకూలంగా ఉందని సైకిల్ పార్టీ నేతలు అంచనా. ముఖ్యంగా పట్టణ, సిటీ ఓటర్లు తమవైపు మొగ్గు చూపారన్నది నేతల విశ్లేషణ. ప్రతి దశలోనూ తమదే పైచేయి అని చెప్పుకొచ్చారు. కనీసం కూటమి 130 సీట్ల రావచ్చని లెక్కలు వేసుకుంటున్నారు. టీవీ ఛానెళ్ల విశ్లేషణకు వద్దాం. పోలింగ్ జరుగుతుండగా రెండు ఛానెళ్లు తమ తమ లెక్కలు బయటపెట్టాయి. ఒకరు వైసీపీకి వైపు మొగ్గు చూపగా, మరొకరు టీడీపీకి అనుకూలంగా చెప్పుకొచ్చాయి. ఆ ఛానెళ్ల గురించి అందరికీ తెల్సిందే. పార్టీలకు అనుగుణంగా అంచనాలు వేశాయని అంటున్నారు. సోషల్ ఇంజనీర్, రాజకీయ స్ట్రాటజిస్ట్ పీకే అలియాస్ ప్రశాంత్‌కిషోర్ గురించి అందరికీ తెల్సిందే.

## సంపాదకీయం

# సత్యాన్వేషణలో రాహుల్ గాంధీ!

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకై ఎంతో శ్రమించినప్పటికి ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రాకపోవడంపై అధ్యయనం చేసిన రాహుల్ గాంధీకి బలమైన సైద్ధాంతిక భూమిక అవసరమన్న విషయం బోధపడింది. అందుకే అప్పటి నుండి అంబేద్కర్ ఇజం, మార్క్సిజం, బుద్ధిజంపై అవగాహన పెంచుకున్నారు. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వాటిని ప్రజల్లో ఆచరణలో పెట్టడం ప్రారంభించాడు. అందులో భాగమే భారత్ జోడో యాత్ర. ఈ ఎన్నికల కోసం రాహుల్ గాంధీ.. ప్రగతిశీల, సామ్యవాద, సిద్ధాంతాల భూమికతో పార్టీని నిర్మాణం చేయాలన్న దృక్పథంతో ముందుకు వెళ్లారు. బీజేపీ హిందుత్వ సిద్ధాంతానికి దేశీయ కోణంలో విరుగుడు కనిపెట్టే పనిలో రాహుల్ గాంధీ రహస్య విప్లవ నిర్మాణానికై అన్వేషణ మొదలు పెట్టాడు. ఈ అన్వేషణ విజయాన్ని ముద్దాడే రోజు ఈ దేశం నూతన రాజకీయ అధ్యాయంలోకి అడుగుపెడుతుంది. ఒక సిద్ధాంతాన్ని నమ్ముకొని నిలబడటం ఆచరించడం, నిర్మాణం చేయడం అనేది మామూలు విషయం కాదు. భారత సమాజంలో భావ జాల ధార అనేది ప్రజలని ప్రభావితం చేసే ప్రధానమైన అంశం. ఇప్పటి ఆధునిక కాలమే కాదు అనాది కాలం నుండి అనేక తర్కల మధ్య ఘర్షణ, చర్చ అనేది చూస్తూనే ఉన్నాం. సనాతన, బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, గాణపత్య, శాక్తేయ, ఇలా శాకోపశాకలుగా అనేక భావజాల జీవదారాలు ఈ నేలను సుసంపన్నం చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఆధునిక నాగరిక సమాజంలో అనేక రాజకీయ పార్టీలు తన విచారధారను ప్రజల ముందు ఉంచుతున్నాయి. దేశ స్వాతంత్ర అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా దేశభక్తి, ప్రగతిశీల లౌకిక వాదాన్ని తన సిద్ధాంతాలుగా ప్రజల ముందు పెట్టింది. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా వామపక్ష వాదం బలంగా ఉండటం. అనేక దేశాలు కమ్యూనిజాన్ని ఆశ్రయించడం.. చైనా, రష్యా, యూరప్ అంత వామపక్ష భావజాలంలోకి వెళ్లడంతో సహజంగానే ఆ ప్రభావం భారత్ పైన పడింది. కానీ మనదేశంలో గాంధీ ఇజం బలమైన ప్రభావం చూపడంతో ఇక్కడ వామపక్ష ప్రభావం నిర్ణయాత్మక శక్తిగా ఎదగలేక పోయింది. నెహ్రూ, గాంధీ ఇజానికి తోడు నెహ్రూ ఆధునిక భావజాలం, ప్రగతిశీల సోషలిస్టు భావజాలం దేశ ప్రజలను ఆకట్టుకుంది. గాంధీ దేశీయ ఆలోచన పండిట్ నెహ్రూ అంతర్జాతీయ సోషలిస్టు భావజాలం కలగలిపి భారత పునర్నిర్మాణానికి దోహదపడింది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా లాంటి వారు గాంధీ మార్గాన్ని అనుసరించడంతో గాంధేయవాదం అంతర్జాతీయం అయ్యింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నిరసిస్తూ మతపరమైన ఏకీకరణ కోసం సాంస్కృతిక పరమైన సంస్థగా ఏర్పడిన 'ఆర్ఎస్ఎస్' అనతికాలంలోనే దేశవ్యాప్తంగా విస్తరించింది. దీనికి అనుబంధంగా ఏబీవీపీ, వీహెచ్‌పీ, హిందువాహిని, విద్య, సేవ భారతి లాంటి సంస్థలు వివిధ విభాగాలపై పట్టు సాధించాయి. సంఘ్ మద్దతుదారుల కలయికతో ఆవిర్భవించిన జన సంఘ్ నుండి అనతి కాలంలోనే భారతీయ జనతాపార్టీగా ఆవిర్భవించడం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పూర్తిస్థాయి రాజకీయ విభాగంగా మారి దేశ శక్తి, హిందూత్వ ఎజెండాగా నూతన రాజకీయ సిద్ధాంతాన్ని భారత ప్రజల ముందు ఉంచారు. ఇలా బీజేపీ రాకతో రైట్ వింగ్, లెఫ్ట్ వింగ్‌ల మధ్య భావజాల ఘర్షణ మొదలైయ్యింది. అయితే ప్రస్తుతం దేశంలో మునుపు ఎన్నడూ లేని సైద్ధాంతిక ఘర్షణ భారత రాజకీయాల్లో నేడు ప్రధాన చర్చగా సాగుతున్నది. నిజానికి గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఆస్కారం లేకుండా రాజకీయాలు చేయడంతో బీజేపీ బలమైన భావజాలాన్ని ప్రజల్లో ప్రచారం చేసుకుంది. బీజేపీ హిందుత్వ వాదాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ కొంతమేర నిర్లక్ష్యం చేయడంతో బీజేపీది సైద్ధాంతికంగా పైచేయి సాధించి కాంగ్రెస్ వరుస ఓటములను చవిచూసింది. ప్రతి ఎన్నికల కోసం రాహుల్ గాంధీ ఎంతగా శ్రమించినప్పటికి ఫలితాలు మాత్రం ఓటమి అంచుకే చేరుకునివి. గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సంక్షోభంలో జారుకోవడం సీనియర్ నేతలంతా దూరం కావడంతో ఆ పార్టీ చతికిలపడింది. అందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ద్వారా దేశంలోని ప్రగతిశీల, సామ్యవాద, సిద్ధాంతాల భూమికతో పార్టీని నిర్మాణం చేయాలన్న దృక్పథంతో ముందుకు వెళ్లారు. ఈ యాత్రలో రాహుల్ గాంధీ యోగేందర్ యాదవ్, ప్రశాంత్ భూషణ్, ప్రొ. హరగోపాల్, ప్రొ. కంచ ఐలయ్య, ప్రొ. కోదండరాం లాంటి మేధావులతో పాటు ప్రముఖ జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అవగాహన పెంచుకుంటూ ముందుకు సాగుతుండటంతో కాంగ్రెస్ మెరుగుపడుతున్న పరిస్థితి మొదలైనది. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ లాంటి రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని తెచ్చుకోగలిగింది. బీజేపీ హిందుత్వ సిద్ధాంతానికి విరుగుడు కనిపెట్టే పనిలో రాహుల్ గాంధీ రహస్య విప్లవ నిర్మాణానికై అన్వేషణ మొదలు పెట్టాడు. ఇది విజయాన్ని ముద్దాడే రోజు ఈ దేశం, నూతన రాజకీయ అధ్యాయంలోకి అడుగుపెడుతుంది. కాంగ్రెస్‌కి పూర్తిస్థాయి అధికారం కైవసం అవుతుంది. దేశ రాజకీయాల్లో భారి అవమానాలు మోసినా, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిన రాహుల్ గాంధీ గొప్ప తత్వవేత్తగా కనిపించే రోజులు సమీపంలో ఉన్నాయి. దేశ రాజకీయాలలో జరుగుతున్న సైద్ధాంతిక పోరులో ఎవరు విజయతీరాలకు చేరుతారో.. బిన్నత్వంలో ఏకత్వం ద్వారా యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా ఉన్న భారతదేశం భిన్న సిద్ధాంతాల ఘర్షణలో ఎవరిది పై చేయి అవుతుందో కాలానికి వదిలేద్దాం.

# అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు

యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933–34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941–42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937–39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940–42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60– 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు... వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940–42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945–46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది.

1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం–గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు. "మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంధాలయం ఏర్పడ్డాయి.

# విద్య పరిరక్షణ అందరి బాధ్యత

విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసుకుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రసిద్ధ గురువులు ఉన్నారు. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశురాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణాచార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్యాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యా యులు గుర్తుంచు కోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించ వలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచు కున్నారు. ఇందుకు ఉదాహరణలుగా శ్రీరాముడు– విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు– సాందీపుడు, శివాజీ– సమర్థ రామదాసు, వివేకానంద– రామకృష్ణ పరమహంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ– పితృదేవోభవ– ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారి పోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఊతమిచ్చింది. ఇప్పుడు గతంలో కంటే, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో కలిసి పనిచేయాలి. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించ డానికి, వెనక బడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, పాఠశాలలలో అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్క భవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం.

# డెంగ్యూ నిర్మూలణే ప్రాధాన్యమవ్వాలి

అత్యంత ప్రమాదకర డెంగ్యూ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన, వ్యాధి నివారణ పట్ల పరిజ్ఞానం, వ్యాధి చికిత్స మార్గాలు లాంటి అంశాలను సామాన్య ప్రజలకు అవగాహన కలిగించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నేతృత్వంలో ప్రతి ఏట 16 మే రోజున 'జాతీయ డెంగ్యూ నివారణ దినం ( నేషనల్ డెంగ్యూ డే)' పాటించుట ఆనవాయితీగా మారింది. జాతీయ డెంగ్యూ దినం–2024 నినాదంగా "రేపటి తరాన్ని పరిరక్షించుటలో డెంగ్యూ నివారణ మన కర్తవ్యం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. భారత దేశవ్యాప్తంగా విస్తరించిన డెంగ్యూ వైరల్ వ్యాధి ఆడ 'ఏడస్ ఎజిప్టి' రకమైన దోమకాటుతో సంక్రమిస్తున్నది. ఈ వ్యాధికి 4 రకాల (డెంగ్యూ వైరస్–1 నుంచి డెంగ్యూ వైరస్–4 వరకు) స్టీరియోటైప్ వైరస్‌లు కారణమని తెలుస్తున్నది.

2017లో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అత్యధిక డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని, 2021లో ఒక్క పంజాబ్‌లోనే అత్యధికంగా 16,129 డెంగ్యూ కేసులు బయట పడ్డాయని గణాంకాలు తెలుపుతున్నాయి. చికిత్సతో నయం చేయగల డెంగ్యూ వ్యాధి రెండవ సారి సోకితే ప్రాణాంతకంగా మారవచ్చు. దోమకాటు అనంతరం 3–14 రోజుల్లో డెంగ్యూ వ్యాధి లక్షణాలు బయట పడతాయి. డెంగ్యూ వైరస్‌కు సరైన ఆంటీ–వైరల్ ఔషధాలు లేనప్పటికీ తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం అవుతుంది. డెంగ్యూ రోగులు చికిత్స సమయంలో ద్రవ ఆహారం విధిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. దోమ కాటుతో డెంగ్యూతో పాటు మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, జీకా అంటువ్యాధి లాంటివి వస్తాయని మనకు తెలుసు. ప్రపంచవ్యాప్తంగా 15 జూన్ రోజున 'అంతర్జాతీయ డెంగ్యూ వ్యతిరేక దినం' పాటించబడుతున్న విషయం మనకు తెలుసు.

డెంగ్యూ వ్యాధి సోకిన రోగుల్లో అధిక జ్వరం, తలనొప్పి, కండర కీళ్ళ నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, రక్తస్రావం, బిపి తగ్గడం, ప్లేట్లెట్లు పడిపోవడం, అలసట (ఫాటిగ్యూ), దురద దద్దుర్లు (రాషెస్), కంటి వెనుక నొప్పి లాంటి రోగ లక్షణాలు కలుస్తాయి. రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి. నీటి పాత్రలకు మూతలు పెట్టాలి కుటుంబ సభ్యులు శరీరం పూర్తిగా కప్పేలా దుస్తువులు ధరించాలి. దోమ తెరలు, దోమలను వికర్షించే ఔషధాలు వాడాలి. దోమలు దరి చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగ్యూ నివారణ, నియంత్రణ ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. దోమల తావులను గుర్తించి నాశనం చేయడం, దోమ కాటు నుంచి స్వయం రక్షణ పొందడం, తొలి దశలోనే గుర్తించడం, దోమల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవడం మరువరాదు. డెంగ్యూ లాంటి పలు వ్యాధుల నియంత్రణకు, రోగ నిరోధకశక్తి పెరుగుదలకు ధ్యానం, ప్రాణాయామం, శారీరక వ్యాయామం, యోగా, పోషకాహారం తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయని డబ్ల్యూహెచ్ఓ ప్రకటిస్తున్నది. దాదాపు 50 శాతం ప్రపంచ జనాభా డెంగ్యూ ముంగిట నిలిచి ఉన్నదని గమనించాలి. "డెంగ్యూ నివారణకు చేయి చేయి కలుపుదాం" అనే నినాదంతో ప్రాణాంతక వ్యాధి కట్టడికి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మనల్ని దోమ కాటు వేయక ముందే మనమే దోమలను ఖతం చేద్దాం.

# బీజేపీ నేతలకు విషమ పరీక్షే

**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీ నేతలకు ఈ ఎన్నికలు కఠిన పరీక్ష. తెలంగాణ పై పార్టీ అధినాయకత్వం ఎన్నో హోప్స్ పెట్టుకుంది. గత ఎన్నికల్లోనే నాలుగు పార్లమెంటు నియోజకవర్గాల్లో విజయం సాధించింది. గత అసెంబ్లీలో కేవలం ఒక నియోజకవర్గం నుంచే కమలం పార్టీ గెలిచింది. కానీ ఈసారి అలా కాదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. తెలంగాణలో మూడో అతి పెద్ద పార్టీగా అవతరించింది. కొంచెం కష్టపడితే ఇక్కడ గెలవడం సులువని భావించిన అగ్రనేతలు ఎక్కువ సార్లు పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అమిత్ షా, కేంద్రమంత్రులందరూ తెలంగాణలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. ఇక ఫలితాల కోసం మరో ఇరవై రోజులు వెయిట్ చేయాలి. తెలంగాణలో పదిహేడు పార్లమెంటు నియోజకవర్గాలున్నాయి. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత అత్యధిక స్థానాలు గెలుచుకునేది తెలంగాణలో మాత్రమేనని నమ్మకం. అందుకే ఇక్కడ నేతలకు గత కొన్నేళ్లుగా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డిని నియమించారు. రాజ్యసభ సభ్యుడిగా లక్ష్మణ్ ను ఎంపిక చేశారు. అంతేకాదు ఇంద్రసేనారెడ్డి, దత్తాత్రేయలకు గవర్నర్ గిరీ లభించింది. ఇన్ని పదవులు ఇచ్చింది పార్టీని మరింత బలోపేతం చేయడం కోసమేనన్నది అందరికీ తెలిసిందే. అందుకే ఈసారి ఎక్స్‌పెక్టేషన్స్ తెలంగాణపై ఎక్కువగా ఉన్నాయి. కనీసం ఎనిమిది నుంచి పది స్థానాల్లో గెలవాలన్న లక్ష్యాన్ని నేతలకు నిర్దేశించారు. తెలంగాణలో ఒంటరిగా పోటీ చేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తే రానున్న కాలంలో తెలంగాణ నుంచి మరింత మందికి పదవులు దక్కే అవకాశముందని ఇప్పటికే సంకేతాలు పంపిన కేంద్ర నాయకత్వం పార్టీ నాయకులకు ఎప్పటికప్పుడు స్వీట్ వార్నింగ్ లు ఇస్తూనే ఉంది. గత ఎన్నికల్లో గెలిచిన స్థానాలతో పాటు మరికొన్ని స్థానాలు కమలం ఖాతాలో పడాలని ఈసారి ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఎక్కువగా టిక్కెట్లు కూడా కేటాయించారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఆర్థికంగా, సామాజికంగా మాత్రమే కాకుండా ఓటు బ్యాంకును పెంచుకునే విధంగా హైదరాబాద్ వంటి నియోజకవర్గంలోనూ ఈసారి విలక్షణమైన వారిని ఎంపిక చేసింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో కలిసినా అక్కడ ఆరు పార్లమెంటు నియోజకవర్గాల్లోనే పోటీకి దిగింది. అక్కడ కంటే తెలంగాణలో ఎక్కువ స్థానాలు గెలవాలన్నది పార్టీ అగ్రనేతల లక్ష్యం. ఎందుకంటే అక్కడ కూటమితో ఉండటంతో గెలిచినా పార్టీ బలోపేతం సాధ్యం కాదు. అందుకే తెలంగాణలో టీడీపీతో కానీ, జనసేనతో కానీ పోటీ చేయకుండా ఒంటరిగానే పోటీకి దిగింది. అదే ఇప్పుడు తెలంగాణ నేతలకు అసలు సమస్యగా మారింది. ఎక్కువ స్థానాలు గెలుచుకోకపోతే మాత్రం ఇక్కడి నేతలను ఖచ్చితంగా పార్టీ నాయకత్వం పక్కన పెడుతుందన్న ప్రచారం జరుగుతుండటంతో అందరిలోనూ అదే టెన్షన్ నెలకొంది. మరి చివరకు తెలంగాణ నేతలు ఏ మేరకు సక్సెస్ అవుతారన్నది చూడాల్సి ఉంది. మరో ఇరవై రోజులు మాత్రమే రిలీఫ్. ఫలితాలు వచ్చిన తర్వాత కానీ అసలు విషయం తెలియదు.



# సమ్మర్ క్యాంపుల్లో పిల్లలు ఎంజాయ్

**హైదరాబాద్ :** సిటీ లో జీహెచ్ఎంసీతో పాటు ప్రైవేట్ సెంటర్లలో సమ్మర్ క్యాంపుల్లో పిల్లలు మస్త్ ఎంజాయ్ చేస్తున్నారు. గతేడాది మేలో ఇదే సమయానికి కేవలం 4, 000 లోపు రిజిస్ట్రేషన్లు మాత్రమే వచ్చాయి. ఈ ఏడాది 16, 000 మంది రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారు. అత్యధికంగా ఖైరతాబాద్ జోన్ లో 8000 మంది ఉండగా, సికింద్రాబాద్ జోన్ లో 3,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగతా నాలుగు జోన్లలో వెయ్యిమంది చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరోవారం రోజుల్లో ఈ సంఖ్య 50 వేల వరకు పెరిగే చాన్స్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సమ్మర్ క్యాంపుల్లో ఎక్కువగా స్విమ్మింగ్, క్రికెట్, షటిల్ గేమ్స్ కు ఫుల్ డిమాండ్ ఉంది. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో 30 నుంచి 40 శాతం వీటికోసమే ఉన్నాయి. అటు ప్రైవేట్ సెంటర్లలోనూ వీటికే ఎక్కువగా డిమాండ్ ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో స్విమ్మింగ్ పై ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతున్నారు. గత నెల 25 నుంచి ప్రారంభమైన జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంపులు ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను బట్టి ఫీజులు ఉన్నాయి. సిటీలో ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్ 300 లకుపైనే ఉన్నాయి. ప్రస్తుతం సమ్మర్ సీజన్ కావడంతో అన్నిచోట్ల రద్దీ ఉంది. స్కూల్స్, కాలేజీలకు హాలీడేస్ కావడంతో పిల్లలు పెద్ద ఎత్తున వెళుతున్నారు. పెద్దలు కూడా స్విమ్మింగ్ కు వస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రైవేట్ సెంటర్లలో స్విమ్మింగ్ పూల్స్ ని బట్టి రోజుకు 100 నుంచి 500 దాకా తీసుకుంటున్నారు.



అథ్లెటిక్స్, ఆర్చరీ, బాల్ బాడ్మింటన్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, బేస్ బాల్, బాక్సింగ్, క్రికెట్, చెస్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్ బాల్, జిమ్నాస్టిక్, హాకీ, హ్యాండ్ బాల్, జూడో, కరాటే, కబడ్డీ, ఖోఖో, కార్ఫ్ బాల్, మాల్ కంబా వంటి 44 రకాల గేమ్స్లో కోచింగ్ ఇస్తున్నారు. ఇందులో షటిల్, బాస్కెట్ బాల్, టెన్నిస్ క్రీడలకు రూ.50 ఉండగా, మిగతా అన్నింటికి రూ.10 మాత్రమే ఫీజు ఉంది.రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లిస్తే సరిపోతుంది. క్యాంపులు పూర్తయిన తర్వాత జీహెచ్ఎంసీ తరపున సర్టిఫికెట్ కూడా అందిస్తారు. 6 నుంచి 16 ఏండ్లలోపు ఉండి ఆసక్తి ఉన్నవారు వెబ్ సైట్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని , ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయని ఖైరతాబాద్ జోన్ గేమ్స్ ఇన్ స్పెక్టర్ మాధవి తెలిపారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచార హోరు

**వరంగలల్ :** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 63 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా, 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగియడంతో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.2021లో ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. అయితే గతేడాది డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి కాలం మార్చి 2027 వరకు ఉంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాలన్న నిబంధనలు ఉన్నాయి. దీంతో ఈ స్థానానికి ఎన్నికల సంఘం ఉప ఎన్నికను నిర్వహిస్తోంది.ఈ పట్టభద్రుల నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ ? ఖమ్మం -నల్లగొండ జిల్లాల్లో విస్తరించి ఉంది. 12 జిల్లాల్లో 4,61,806 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 2,87,007 మంది పురుషులు కాగా, 1,74,794 మంది మహిళలు, ఇతరులు ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నల్గొండ జిల్లా కలెక్టర్ హరి చందన వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక స్థానానికి నిన్నటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. మొత్తం 63 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా, 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పోటీ చేస్తున్నారు. 2021 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మల్లన్న రెండో స్థానంలో నిలిచారు. ఈసారి ఆయన కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి పోటీ చేస్తున్నారు. బిజెపిలో చాలా కాలం పని చేసిన రాకేష్ రెడ్డి.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ లో చేరారు. రాకేష్ రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. బిజెపి అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. 2021 ఎన్నికల్లో కూడా బిజెపి తరపున ప్రేమేందర్ రెడ్డి పోటీ చేశారు. తిరిగి రెండోసారి పోటీపడుతున్న ప్రేమేందర్ రెడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టబదుల స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక పోలింగ్ ఈనెల 27వ తేదీన జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.12 జిల్లాల పరిధిలో 605 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగే ఈ ఎన్నికలో 4.63 లక్షల మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుందని, కౌంటింగ్ ప్రక్రియ రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



## చేతి పంపు చుట్టూ ప్రహారీ గోడ


### నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు





**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తాండూర్ మండలం గోపాల్ నగర్ ఎస్టీ కాలనిలో గత నలబై సంవత్సరాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్న ప్రభుత్వ చేతిపంపు వద్దకు వెళ్ళడానికి వీలు లేకుండా మండిగా రవీందర్ అనే వ్యక్తి ప్రహరీ గోడ నిర్మించారని కాలనీ ప్రజలు ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ సత్యనారాయణ, తహశీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పఠాన్ కు పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చేతి పంపు చుట్టూ గోడ నిర్మించడం వల్ల గత కొన్ని రోజులుగా మంచి నిరులేక ఇబ్బందులు పడుతున్నామని ప్రహరీ గోడ తొలగించి ఎప్పటి లాగే యధావిదంగా ప్రభుత్వ చేతిపంపు ను అందుబాటులోకి తీసుకురావలని అధికారులను కోరారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని పిప్పల్ కోటిలో మద్యానికి బానిసై ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గుగ్గిల పోచన్న కుమారుడితో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. కానీ పొచ్చన్న కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. దీనితో జీవితం పై విరక్తి కలిగి మంగళవారం రాత్రి వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆయనకు భార్య రమణబాయి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఎస్సై ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం

**తిరుపతి :** బాధితులకు అండగా నిలబడాల్సిన పోలీస్ వ్యవస్థ కంచె చేను మేసిన విధంగా ప్రవర్తిస్తోందని చంద్రగిరి టిడిపి ఎం.ఎల్. ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి దుయ్యబట్టారు. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పులివర్తి నాని పై జరిగిన దాడికి నిరసనగా పులివర్తి సుధా రెడ్డి తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి తమ నిరసన తెలియజేశారు. పులివర్తి సుధా రెడ్డికి మద్దతుగా తెలుగు తమ్ముళ్లు పోలీస్ స్టేషన్ వద్ద కు భారీగా చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తిరుచానూరు సిఐ శ్రీకాంత్ రెడ్డి పులివర్తి సుధా రెడ్డికి నచ్చజెపి నిరసనను విరమింప చేయాలని ప్రయత్నించడంతో ఒక్కసారిగా టిడిపి నిరసనకారులు నాని పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని అంతవరకు కదిలేది లేదని భీష్మించుకుని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడాల్సిన పోలీసు వారు టిడిపి సానుభూతిపరులను అరెస్టు చేయడం అమానుషమని అన్నారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థ దాడికి దిగిన వారిని అరెస్టు చేయకుండా మీనమేషాలు లెక్కబెడుతున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి వారిని జూన్ 4వ తేదీ వరకు అరెస్ట్ చేయలేమని జిల్లా ఎస్పీ చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అలాగే టిడిపి చిత్తూరు జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు సిఆర్ రాజన్ మాట్లాడుతూ పోలీసు వారు టిడిపి వారు సానుభూతిపరులను ఎందుకు అరెస్ట్ చేశారు అని ప్రశ్నిస్తే ప్రివెంటివ్ యాక్ట్ కింద అరెస్ట్ చేసాం అనడం హాస్యాస్పదమని అన్నారు. వైసిపి వారు ఓడిపోతున్నామని దుగ్ధ తో టిడిపి వారిపై దాడులకు పాల్పడుతున్నారని, గుండా గిరి చేస్తూనారని ధ్వజమెత్తారు. వైసిపి రౌడీయిజాన్ని చూస్తూ సహించబోమని త్వరలోనే వైసీపీ వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. చట్ట పరంగా దాడికి పాల్పడిన వారికి శిక్ష పడేంత వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సుధా రెడ్డికి మద్దతుగా చంద్రగిరి జనసేన పార్టీ ముఖ్య నాయకులు మనోహర దేవర, టిడిపి తిరుచానూరు గ్రామ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, చంద్రగిరి బీసీ అధ్యక్షులు మునిరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 10 రోజుల పాటు సింగిల్ స్క్రీన్స్ బంద్

**హైదరాబాద్ :** ఇండియాలో ఎక్కువగా జనాలను ఆకట్టుకునేవి రెండే రెండు ఒకటి సినిమా, రెండోది క్రికెట్.. సినిమాల విషయానికొస్తే ఇండియా మూవీస్ కు పెద్ద పీట వేస్తుంది. మన సినిమాలు ప్రపంచ వ్యాప్తగా గుర్తింపు తెచుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ఓటీటీలు వచ్చాకా థియేటర్స్ కు పెద్ద సంఖ్యంలో జనాలు రావడంలేదు అని గతంలో చాలా మంది ఆరోపించారు. అలాగే సినిమా నచ్చితే థియేటర్స్ లో కూడా చూస్తారు అని కొన్ని సినిమాలు నిరూపించాయి. ఇక ఇప్పుడు థియేటర్స్ లో రిలీజ్ అయినా నెల రోజులకు ఓటీటీల్లో సినిమాలు స్ట్రీమింగ్ అవుతున్నాయి. దాంతో థియేటర్స్ యాజమాన్యం కాస్త ఊపిరి పీల్చుకుంది. కానీ ఇప్పుడు మరో సమస్య వచ్చి పడింది. దీని నుంచి బయట పడేందుకు ఏకంగా పది రోజుల పాటు థియేటర్స్ ను మూసివేయనున్నారు.అవును తెలుగు రాష్ట్రాల్లో పదిరోజుల పాటు థియేటర్స్ మూసివేయాలని సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. జనాలు బయటకు రావడానికి జడుస్తున్నారు. అక్కడక్కడా వర్షాలు కురిస్తున్నా వాతావరణం పూర్తిగా మారలేదు. మరో వైపు ఎలక్షన్స్ హంగామా నడుస్తుంది. అలాగే ఐపీఎల్ సీజన్ కూడా కావడంతో ప్రేక్షకులు థియేటర్స్ కు రావడం లేదు.ప్రేక్షకులు లేక థియేటర్స్ బోసిపోతున్నాయి. దాంతో పరిస్థితులు చక్కబడేంతవరకు థియేటర్స్ మూసివేయాలని సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ శుక్రవారం నుంచి పదిరోజుల పాటు తాత్కాలికంగా థియేటర్స్ ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.

# ఆకాల వర్షం... ఆపార నష్టం



**అదిలాబాద్ :** ఉమ్మడి ఆదిలాబాద్ లో గత రెండు రోజులుగా వీచిన గాలి, అకాల వర్షాలకు భారీగా పంట నష్టం జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ లోని నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, జిల్లా లోని పలు మండలాలలో కురిసిన భారీ వర్షానికి కోత కు వచ్చిన వరి పంట నేలకొరిగింది.పలు గ్రామాల్లో ఐకేపీ, పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా కొం దరు రైతులు తీసుకువచ్చిన వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యమైంది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసిపోయింది. తడిసిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.గిమ్మ గ్రామంలో ఆదివారం ఈదురుగాలుల వర్షంతో పిడుగు పడి ఒకరు మృతి చెందగా, అందులో తీవ్ర గాయాలు పాలైన మరొకరు మృతి చెందారు. గిమ్మ గ్రామానికి యువ రైతు మందస సంటెన్న పొలం పనులకు వెళ్లి వస్తుండగా పిడుగు పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన సంటెన్నను హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12 గంటల సమయంలో పరిస్థితి విషమించే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదు రుగాలులకుతోడు ఉరుములు, మెరుపులతో కూడిన వాన గంటకుపైగా కురవడంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని తహ సీల్దార్ కార్యాలయం ఎదుట గల పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాల వద్ద వర్షపు నీరు నిలిచింది.మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి ఉంచినప్పటికీ భారీ వర్షం ధాటికి పలువురు రైతుల ధాన్యం కొట్టుకు పోవడంతో కాపాడుకునేందుకు రైతులు వర్షంలోనే అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వారసంతలో చిరువ్యాపారులు వాన ధాటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.కుభీరు మండలంలోని సిర్పెల్లి తండా, గొడిసెర్చ్, తదితర గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. కోసి ఆరబెట్టిన మొక్కజొన్న, నువ్వు పంటలు తడిసి ముద్దయ్యాయి. సిర్పెల్లి తండాలో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ గద్దె పై నుంచి పడిపోయింది పలుచోట్ల స్తంభాలు వంగిపోయి విద్యుత్తు సరఫ రాకు అంతరాయం ఏర్పడింది.


# గెలుపు, ఓటములు నిర్ణయించే రూరల్ ఓటరు



**వరంగల్ :** రాష్ట్రంలో సోమవారం జరిగిన లోక్సభ ఎన్నికల్లో మరోసారి పల్లె ఓటెత్తింది. ఎప్పటిలెక్కనే పట్టణ ఓటర్లు నిరాశపర్చారు. గెలుపోటములను డిసైడ్ చేసేది రూరల్ ఓటు బ్యాంకే కావడంతో గ్రామాల్లో నమోదైన ఓట్లు ఎటువైపు మళ్లాయనే దానిపై పొలిటికల్ లీడర్లు, క్యాండిడేట్లు లెక్కలు వేసుకుంటున్నారు. ఓటర్లు ఎవరి వైపు మొగ్గుచూపారనే దానిపై ఓ అంచనాకు వస్తున్నారు.రూరల్లో నమోదైన పోలింగ్ ఎవరికి లాభం చేకూరుస్తుందని.. ఏయే పోలింగ్ సెంటర్లో ఎంత ఓటింగ్ శాతం నమోదైందన్న వివరాలు తెప్పించుకొని విశ్లేషించుకుంటున్నారు. గెలుపు తమదంటే తమదేనని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సాధారణంగా జనరల్ ఎలక్షన్స్ లో ఓటింగ్ శాతం పెరిగితే అది అధికార పార్టీకి వ్యతిరేకమని పలు ఎన్నికల్లో స్పష్టమైంది. ఇవి పార్లమెంట్ ఎన్నికలు కావడంతోపాటు అందులోనూ ఓటింగ్ శాతం 2019 ఎన్నికల నాటి ఓటింగ్శాతానికి చేరువైంది. అర్బన్తో చూస్తే రూరల్ ఏరియాల్లో ఎక్కువ పోలింగ్ శాతం నమోదు కావడంతో.. అది ఎవరికి కలిసి వస్తుందని లీడర్లు లెక్కలు తీస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పల్లె ఓటర్లు బీఆర్ఎస్ను కాదని, కాంగ్రెస్కు పట్టం కట్టినట్లు..లోక్సభ ఎన్నికల్లోనూ మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుందని, తమవైపే పల్లె జనం ఉన్నారని కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లోని ఓటింగ్పై టెన్షన్ పట్టుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ ఓటర్లు తమను దెబ్బ కొట్టారని, ఇప్పుడూ అదే పరిస్థితి రిపీట్ అవుతుందేమోనని గులాబీ నేతలు కలవరపడుతున్నారు. ఇక, అర్బన్ ఏరియాల్లో ఎక్కువగా ప్రభావం చూపే బీజేపీ..రూరల్ పోలింగ్ శాతాన్ని చూసి కాస్త ఆందోళన చెందుతున్నది. ముఖ్యంగా అభ్యర్థుల తలరాతలు మార్చే అవకాశాలున్న మైనార్టీలతోపాటు మహిళా ఓటర్లు, రైతులు ఏ పార్టీకి మొగ్గు చూపారోనని అన్ని పార్టీల నేతలు ఆరా తీస్తున్నారు. రూరల్ ఓటింగ్ అంతా తమ ఖాతాలోకి వస్తుందనే ధీమాను కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ .. అధికారంలోకి వచ్చిన కొన్నిరోజుల్లోనే అమలులోకి తెచ్చిన ముఖ్యమైన స్కీములు లాభం చేకూరుస్తాయని భావిస్తున్నది. అధికారంలోకి వచ్చిన రెండో నెల నుంచే ప్రతి నెలా 10వ తేదీ లోపు ఆసరా పెన్షన్లు పంపిణీ చేయడంతో 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తమ పార్టీవైపు మొగ్గుచూపినట్లు కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు.ఇక రైతుభరోసా పంపిణీని పోలింగ్ కంటే నాలుగు రోజుల ముందే పూర్తి చేయడం, పంద్రాగస్టులోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం వల్ల రైతులు కూడా తమవైపు నిలిచి ఉంటారని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటున్నది. రాష్ట్రంలో 1.67 కోట్ల మంది మహిళ ఓటర్లు ఉండగా.. ఇందులో 70 శాతం ఓట్లు రూరల్ ఏరియాల్లోనివే. గ్రామాల్లో నమోదైన పోలింగ్పై బీజేపీ, బీఆర్ఎస్ ఎటూ తేల్చుకోలేకపోతున్నవి. పట్టణాల నుంచి రూరల్కు బీజేపీ విస్తరించిందని.. ఆ ఓట్లు తమవేనని ఆ పార్టీ నేతలు బయటికి చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అలా కనిపించడంలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే మోదీ చరిష్మాతో యూత్ ఓట్లు తమకే పడి ఉంటాయని కమలం నేతలు నమ్ముతున్నారు. ఎక్కడెక్కడ ఎంతమంది యూత్ ఓటర్లు ఉన్నారో లెక్కలు తెప్పించుకొని పరిశీలిస్తున్నారు. ఇక.. కరెంట్, నీళ్లు, కల్యాణ లక్ష్మి రుణమాఫీ వంటివాటిపై కాంగ్రెస్ పార్టీపై తమ పార్టీ చీఫ్కేసీఆర్ చేసిన విమర్శలతో గ్రామాల్లో మళ్లీ ఓటు తమ వైపే టర్న్ అయి ఉంటుందని బీఆర్ఎస్ లీడర్లు భావిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ ఓటర్లతోనే కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టింది. రైతులు, యువత, మహిళలు బీఆర్ఎస్ను పక్కన పెట్టి.. కాంగ్రెస్కు జై కొట్టారు. అధికారం కోల్పోయాక బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ కూడా చెల్లాచెదురైంది. ఇంకా రూరల్లో ఓట్లు పడి ఉంటాయా అనే అనుమానం కూడా ఆ పార్టీ నుంచే వస్తున్నది.కిందిస్థాయి లీడర్లు మాత్రం వాస్తవ విషయం తెలిసినప్పటికీ పైకి పాజిటివ్గా రిపోర్టు ఇస్తున్నట్లు సమాచారం. స్టేట్ యూనిట్గా చూస్తే కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా లోక్సభ ఎన్నికలు జరిగాయి. ఓటర్లు కూడా నేషనల్ ప్రాస్పెక్టివ్లోనే ఈ ఎన్నికలను చూసినట్లు చర్చ జరుగుతున్నది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా చూస్తే.. 13 సెగ్మెంట్లలో ప్రతి సెగ్మెంట్లో యావరేజ్గా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవే ఉన్నాయి. రెండు, కొన్నిచోట్ల మూడు చొప్పున పూర్తిగా అర్బన్ లేదా 75 శాతం మేర పట్టణ ప్రాంత ఓటర్లను కలిగి ఉన్నాయి. మిగిలిన నాలుగింటిలో సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్గిరిల్లో పూర్తిగా, చేవెళ్లలో కొంత పార్ట్ పట్టణ ప్రాంతంలో ఉన్నది.అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గాలతో చూస్తే రూరల్ నియోజకవర్గాల్లో యావరేజ్గా 68 శాతం నుంచి 75 శాతం మేర పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల 80 శాతానికి చేరింది. అదే పట్టణ ప్రాంత అసెంబ్లీ నియోజకవర్గాల్లో 58% నుంచి 65% లోపు ఉన్నది. ఈ లెక్కన గెలుపోటము లను, మెజార్టీని తారుమారు చేసేది పూర్తిగా రూరల్ ఓటు బ్యాంకే కావడంతో మరింత లోతు గా పార్టీలు ఫీడ్ బ్యాక్తెప్పించుకుంటున్నాయి.

# ఎవరి అంచనాల్లో వారే...

**కరీంనగర్ :** ఉత్కంఠ భరితంగా సాగిన కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులు పోలింగ్ సరళిపై దృష్టి పెట్టారు. గత ఎన్నికల లాగానే ఇప్పుడు కూడ 72 శాతం వరకు పోలింగ్ నమోదు అయ్యింది. స్థిరంగా ఉన్న పోలింగ్ పైనా , గెలుపోటముల పైనా లోతుగా అధ్యయనం చేస్తున్నారు. పోలింగ్ సరళి తమ విజయానికి దోహదం చేస్తుందని మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమాని వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో 72 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గత ఎన్నికలలో కుడా ఇంచుమించుగా ఇదే పోలింగ్ శాతం నమోదు అయ్యింది. బిజేపి నుండి బండిసంజయ్, కాంగ్రెస్ నుండి వెలిచాల రాజేందర్ రావు, బిఆర్ఎస్ నుండి వినోద్ కుమార్ బరిలో ఉన్నారు. ఈ ముగ్గురు కూడా గెలుపుపై ధీమాని వ్యక్తం చేస్తున్నారు. ఈసారి గ్రామీణ ఓటర్లతో పాటు పట్టణ ఓటర్లు అసక్తిగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. కౌంటింగ్?కి మరో ఇరవై రోజుల సమయం ఉన్న నేపథ్యంలో మరింత లోతుగా విశ్లేషణ చేపడుతున్నారు.బీజేపీ అభ్యర్థి బండిసంజయ్ కేంద్ర ప్రభుత్వం పథకాలు, మోడి మానియా ,తాను చేసిన అభివృద్ధి విజయానికి దోహదపడుతాయని భావిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపి అనుకూలంగా ఓటు వేశారని అ పార్టీ నేతలు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేబట్టిన సంక్షేమ పథకాలు, అరుగ్యారంటీలు తమని ఆదరించాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతంలో ఓటింగ్ పెరగడంతో తమకే అనుకూలంగా ఉందని ధీమాతో ఉన్నారు.



క్షేత్రస్థాయిలో పనిచేసిన కార్యకర్తలు, నేతలతో మాట్లాడి ఇన్ పుట్ తెచ్చుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, తమకు అనుకూలంగా ఉందని బిఅర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు తమ పార్టీకే ఓటు వేశారని బిఅర్ఎస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ మూడు పార్టీలు పోలింగ్, బూత్?ల వారిగా నమోదు అయిన ఓట్లు, తమకి వచ్చిన ఓట్లపై అరా తీస్తున్నారు. అసెంబ్లీల వారిగా నమోదు అయిన పోలింగ్ శాతం అనుకూల, ప్రతికూల అంశాలపై కుడా చర్చిస్తున్నారు. అంతే కాకుండా అయా పార్టీల అధిష్టానం కూడా కరీంనగర్ పార్లమెంటుపై దృష్టి సారించి పోలింగ్ సరళీని తెలుసుకోవడంలో నిమగ్నం అయ్యింది. ఎన్ని అంచనాలు వేసినప్పటికి జూన్ నాలుగున అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

## పల్నాడు ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనం

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్లోని పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం దగ్గర ఓ లారీ-ప్రైవేటు బస్సు ఢీకొని భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవ దహనమయ్యారు. ప్రమాదానికి గురైన బస్సు.. బాపట్ల జిల్లా చినగంజాం నుండి హైదరాబాద్ వెళ్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది వరకూ ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఓటు వేయడానికి సొంతూర్లకు వచ్చి.. తిరిగి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగింది. మద్యంమత్తే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కళ్లు తెరిచేలోపే..అగ్నికీలలకు బస్సు ఆహూతయిందని ప్రయాణికులు వాపోతున్నారు. గాఢ నిద్రలో ఉన్నవాళ్లు..నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే అప్రమత్తమై.. 108తో పాటు పోలీసులకు సమాచారం చేరవేశారు.ప్రమాదానికి గురైన అరవింద ట్రావెల్స్ బస్సు.. బాపట్ల జిల్లా చినగంజాం నుంచి పర్చూరు, చిలకలూరిపేట మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు మంగళవారం రాత్రి 40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. వీరిలో చినగంజాం, గొనసపూడి, నీలాయపాలెం వారు ఎక్కువగా ఉన్నారు. వీరంతా సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి.. హైదరాబాద్కు తిరుగు ప్రయాణమైన వారే. మంగళవారం అర్ధరాత్రి సమయంలో చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా శరవేగంగా కంకరతో వచ్చిన టిప్పర్.. బస్సును ఢీ కొట్టింది. క్షణాల్లో టిప్పర్కు మంటలు రేగి.. ఆపై వేగంగా బస్సుకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు వాహనాల్లోని డ్రైవర్లతో పాటు మరో నలుగురు సజీవ దహనమయ్యారు. మరో 20 మంది వరకు తీవ్ర గాయాలపాలయ్యారు.మృతులను బస్సు డ్రైవర్ అంజితో పాటు ఉప్పుగుండూరు కాశీయ్య, ఉప్పుగుండూరు లక్ష్మి, ముప్పరాజు ఖ్యాతి సాయిశ్రీగా గుర్తించారు. మిగిలిన వారిని ఇంకా గుర్తించాల్సి ఉంది.

## 17న జేఈఈ అడ్వాన్స్ హాల్ టిక్కెట్లు

**న్యూఢిల్లీ :** జేఈఈ అడ్వాన్స్డ్ 2024 పరీక్ష అడ్మిట్ కార్డులు మే17వ తేదీన విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. జేఈఈ అడ్వాన్స్డ్కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ నుంచి అడ్మిట్ కార్డులు డౌన్లోడ్ చేసుకోవచ్చు. మే 26వ తేదీన ఈ పరీక్ష దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. ఉదయం షిఫ్ట్లో పేపర్-1 పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్లో పేపర్-2 పరీక్ష 2.30 నుంచి 5.30 గంటల వరకు జరగనుంది. మొత్తం రెండు సెషన్లలో ఆన్లైన్ విధానంలో ఈ పరీక్ష జరుగుతుంది. జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 23 ఐఐటీల్లో, ఇతర ప్రఖ్యాత సంస్థల్లో బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.కాగా ఈ ఏడాది రెండు విడతల్లో నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షలో అర్హత సాధించిన మొదటి 2.5 లక్షల మందిని మాత్రమే జేఈఈ అడ్వాన్స్డ్ రాసేందుకు అనుమతిస్తారు. పరీక్ష అనంతరం ప్రిలిమినరీ ఆన్సర్ కీ జూన్ 2న వెల్లడిస్తారు. కీపై అభ్యంతరాల నమోదు జూన్ 2 నుంచి జూన్ 3 వరకు స్వీకరిస్తారు. ఫైనల్ ఆన్సర్ కీతోపాటు జేఈఈ అడ్వాన్స్ తుది ఫలితాలను జూన్ 9వ తేదీన విడుదల అవుతాయి.జేఈఈ అడ్వాన్స్డ్లో కూడా ఉత్తీర్ణులైన వారు ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత సాధిస్తారు. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ-2024) రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఏఏటీ-2024 పరీక్ష జూన్ 12వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. ఐఐటీల్లోని బీఆర్క్ కోర్సుల్లో చేరేందుకు ఈ పరీక్షలో ర్యాంకులు సాధించవల్సి ఉంటుంది. ఏఏటీ ఫలితాలు జూన్ 15న వెల్లడిస్తారు. జూన్ 10 సాయంత్రం 5 గంటల నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది.

## పల్నాడు జిల్లాలో సెక్షన్ 144 విధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

**పల్నాడు :** పల్నాడులో మాచర్ల సహా పలు నియోజకవర్గాల్లో పరిస్థితిపై అధికారులు స్పందించారు. వెంటనే 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. వైసీపీ రౌడీ మూకలు, ఎమ్మెల్యే ప్రైవేటు సైన్యం హల్ చల్, దాడులపై ఉన్నతాధికారులకు టీడీపీ అధినేత చంద్రబాబు పిర్యాదు చేసారు. డీజీపీకి, గవర్నర్ కు పల్నాడులో శాంతి భద్రతల పరిస్థితిపై లేఖ రాసారు. మంగళవారం రాత్రి మాచర్లలో దాడులు జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు అలెర్టైయారు. డీజీపీ పారామిలటరీ బలగాలను పల్నాడుకు పంపారు. మాచర్ల పట్టణంతో పాటు, గ్రామాల్లో పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటుచేసారు. ప్రస్తుతం 800 మంది అదనపు బలగాలను మాచర్ల నియోజకవర్గానికి పంపారు.

## బస్సు, టిప్పర్ ఢీ

**బస్సులో చెలరేగిన మంటలు**

**డ్రైవర్ సహా నలుగురు మృతి**

**ఒంగోలు :** సొంతూరిపై మమకారం... ఓటు వేయాలని దృఢ సంకల్పం.. పిల్లాజెల్లాతో ఇంటిల్లిపాదీ స్వస్థలాలకు విచ్చేశారు.. సోమవారం నాడు జరిగిన పోలింగ్ లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. బంధుమిత్రులతో రెండు మూడు రోజులు సంతోషంగా గడిపారు. ఉద్యోగ విధులకు వెళ్లాలనే కొండంత ఆశతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. అంతలోనే మృత్యువు.. టిప్పరు రూపంలో దూసుకొచ్చి.. బస్సు డ్రైవరుతో సహా నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది. కళ్లు తెరిచేలోపే.. అగ్నికీలలకు ఆహుతైన విషాదమిది. గాఢ నిద్రలో ఉన్న పదుల సంఖ్యలో ప్రయాణికులను తీవ్ర గాయాలపాలుజేసింది. క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటిన వేళ స్థానికులు అప్రమత్తమై.. 108, పోలీసులకు సమాచారం చేరవేశారు.
స్థానికులు, క్షతగాత్రుల వివరాల మేరకు... బాపట్ల జిల్లా చినగంజాం నుంచి పర్చూరు, చిలకలూరిపేట మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు మంగళవారం రాత్రి అరవింద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. వీరిలో చినగంజాం, గొనసపూడి, నీలాయపాలెం వారు ఎక్కువగా ఉన్నారు. వీరంతా సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి.. హైదరాబాద్కు తిరుగు ప్రయాణమైన వారే. మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో చిలకలూరిపేట మండలం అన్నంబట్లవారిపాలెం - పసుమర్రు గ్రామాల మధ్య ఈవూరివారిపాలెం రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా శరవేగంగా కంకరతో వచ్చిన టిప్పర్.. బస్సును ఢీ కొట్టింది. క్షణాల్లో టిప్పర్కు మంటలు రేగి.. ఆపై వేగం తీవ్రత దృష్ట్యా బస్సుకు మంటలు వ్యాపించాయి.

**తేరుకునేలోపే తెల్లారిన బతుకులు**

ప్రమాద తీవ్రతకు క్షణాల్లో ట్రావెల్స్ బస్సు డ్రైవరు, మరో నలుగురు ఆహుతి అయ్యారు. మరో 20 మంది వరకు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు, బంధువుల శోకాలతో ఆ ప్రాంతంలో విషాదం మిన్నంటింది. స్థానికులు దుర్ఘటన సమాచారాన్ని 108, పోలీసులకు చేరవేయడంతో హుటాహుటిన వారు ప్రమాద స్థలికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా.. చిలకలూరిపేట, యద్దనపూడి, చీరాల, యడ్లపాడు నుంచి 108 వాహనాలను ప్రమాద స్థలికి రప్పించారు. బస్సులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసి.. 108 వాహనాల్లో 20 మంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. బైపాస్ వర్క్ జరుగుతుండటం.. తారు రోడ్డుపై మట్టి భారీగా పేరుకుపోవడం.. టిప్పర్ వేగంగా దూసుకురావడం.. టిప్పర్ డ్రైవర్ వేగాన్ని నియంత్రించ లేకపోవడం ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది


# స్థానిక వార్తలు

## గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా?



గత కొన్నేళ్లుగా రుణం తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రజలు తమ ప్రతి చిన్న, పెద్ద అవసరానికి రుణ సహాయం తీసుకుంటారు. పిల్లల చదువుల నుంచి ఇల్లు కట్టడం, వ్యాపారం చేయడం వరకు అప్పులపైనే ఆధారపడుతున్నారు. అటువంటి పరిస్థితిలో పొందగలిగే సులభమైన రుణం బంగారు రుణం. దేశంలోని టాప్ 6 బ్యాంకుల్లో గోల్డ్ లోన్‌పై వడ్డీ ఎంత ఉంటుందో తెలుసా?దేశంలోని చాలా బ్యాంకులు బంగారు రుణాలను అందిస్తున్నాయి. ఇది కాకుండా, ప్రజలకు బంగారు రుణాలను అందించే అనేక నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఉన్నాయి. బంగారు రుణాలు సాధారణంగా ఇతర రుణాల కంటే తక్కువ వడ్డీని కలిగి ఉంటాయి. అదే సమయంలో ఇది ఇతర రుణాల కంటే వేగంగా కూడా అందుబాటులో ఉంటుంది. 18 నుండి 75 సంవత్సరాల మధ్య వయస్సు గల భారతీయ నివాసి ఎవరైనా బంగారు రుణం తీసుకోవచ్చు. బ్యాంకులకు ఇతర రుణాల కంటే బంగారు రుణం ఇవ్వడం చాలా సురక్షితం. అదే సమయంలో సాధారణ ప్రజలు కూడా ఇతర రుణాల కంటే మెరుగైనదిగా భావిస్తారు. ప్రాచీన కాలం నుండి భారతీయ సంప్రదాయంలో బంగారు రుణం ఒక భాగం. పూర్వకాలంలో బంగారం తాకట్టు పెట్టి స్వర్ణకారులు లేదా వడ్డీ వ్యాపారుల దగ్గర డబ్బు తీసుకునేవారు. ఇప్పుడు బ్యాంకులు కూడా అదే పని చేయడం ప్రారంభించాయి.

## కొత్త వ్యాపారంలోకి పేటీఎం




ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం కొత్త వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. తన ప్లాట్ ఫాంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీసీ) ద్వారా ఆటో రిక్షా బుకింగ్ సేవలను ప్రారంభించనుంది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఆటో రిక్షా రైడ్‌లను అందించేందుకు రైడ్ హెయిలింగ్ మార్కెట్ లోకి అడుగుపెడుతుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..స్మార్ట్ ఫోన్ వినియోగదారులందరికీ పరిచయం చేయనక్కర్లేని యాప్ పేటీఎమ్. దాదాపు ప్రతి ఒక్కరూ దీనిని ఉపయోగిస్తారు. ముఖ్యంగా డిజిటల్ పేమెంట్లు చేయడానికి వాడే నంబర్ వన్ యాప్ అని చెప్పవచ్చు. దీని యూజర్ల దేశంలో అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే ఇటీవల ఆర్బీఐ ఆంక్షలతో పేటీఎం కుదేలైంది. అయినప్పటికీ తిరిగి పుంజుకునేందుకు పేటీఎం కొత్త వ్యాపారంలోకి అడుగు పెట్టడానికి సిద్ధమైంది. పెద్దసంఖ్యలో ఉన్న యూజర్లు తనకు ప్లస్ పాయింట్ మారే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ కొత్త ఫీచర్ పరీక్షల స్థాయిలో ఉంది. చాలా తక్కువ మంది పేటీఎమ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. ఇప్పటికే రైడ్ హెయిలింగ్ లో ఓలా, ఉబర్ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వాటికి పేటీఎం సవాలు విసురుతుందని భావిస్తున్నారు. పేటీఎం ప్రస్తుతం ఎంపిక చేసిన వినియోగదారులతో తన యాప్‌లో రైడ్ హెయిలింగ్ ఫీచర్‌ను పరీక్షిస్తోంది. తదుపరి దశలో క్యాబ్ బుకింగ్ సేవలను కూడా అందించనుంది. గత రెండేళ్లలో ఓఎన్డీసీలో ఫుడ్ డెలివరీ, కిరాణా, ఫ్యాషన్,ఎలక్ట్రానిక్స్ వంటి అనేక ఇ-కామర్స్ ఆఫర్‌లను పేటీఎం ప్రయోగాత్మకంగా ప్రారంభించి, విడుదల చేసింది. పేటీఎం యాప్‌లో బుక్ చేసిన ఆటో రిక్షాలు ఓఎన్డీసీ మద్దతు కలిగిన నమ్మ యాత్రి యాప్ కు అనుసంధానం చేశారు.

# రూ. 69వేలకే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్



ఎలక్ట్రిక్ స్కూటర్ల శ్రేణిలో దేశంలోనే అగ్రశ్రేణి విక్రయదారుగా వెలుగుతోంది ఓలా ఎలక్ట్రిక్. తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేసుకుంది. అయితే దాని ధర విషయంలోనూ వినియోగదారులు కాస్త అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోల్చితే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో అన్ని తరగతుల వారీగా అందుబాటులో ధరలో ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ ను ఓలా ఎలక్ట్రిక్ లాంచ్ చేసింది. ఓలా ఎస్1ఎక్స్ పేరుతో వచ్చిన ఈ స్కూటర్ డెలివరీలను ఓలా ఇటీవల ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఓలా లైనప్ లో ఉన్న స్కూటర్లు అన్నింటిలోకి తక్కువ ధరకు లభ్యమవుతోంది. 2కేడబ్ల్యూ వేరియంట్ రూ. 69,999, 3కేడబ్ల్యూ రూ. 84,999, 4కేడబ్ల్యూ రూ, 99, 999 కి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ధరలన్నీ ఎక్స్ షోరూం. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో అన్ని స్కూటర్లలో కెల్లా ఇదే చవకైన స్కూటర్ గా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల గురించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. ఓలా ఎస్1 ఎక్స్ 2కేడబ్ల్యూ వేరియంట్ కు సంబంధించిన వివరాలను చూస్తే.. సింగిల్ చార్జ్ పై 91 కిలోమీటర్ల రేంజ్ ని ఇస్తుంది. బ్యాటరీ ఫుల్ చార్జ అవడానికి 7.4 గంటలు పడుతుంది. యాక్సలరేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. కేవలం 4.1 సెకండ్లలోనే గంటకు సున్నా నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీనిలో మోటార్ గరిష్ట పవర్ అవుట్ పుట్ 6కేడబ్ల్యూ ఉంటుంది. ఈ స్కూటర్లో ఎకో, నార్మల్, స్పోర్ట్స్ మోడ్స్ ఉంటాయి. గరిష్టంగా గంటకు 85 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలుగుతుంది. ఈ స్కూటర్లో 3.5 అంగుళాల ఎల్సీడీ టచ్ స్ర్కీన్ తో కూడిన ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటుంది. 3కేడబ్ల్యూ వెర్షన్లో కూడా అదే చార్జింగ్ టైం, అవే రైడింగ్ మోడ్స్ ఉంటాయి. అయితే ఫీచర్ల విషయంలోనే కొన్ని అదనంగా యాడ్ అవుతాయి. అలాగే యాక్సలరేషన్ టైం, టాప్ స్పీడ్, రేంజ్ మారతాయి. 3కేడబ్ల్యూ వెర్షన్ 3.3 సెకండ్లలోనే 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. బ్యాటరి సింగిల్ చార్జ్ పై 151 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. అదే సమయంలో 4కేడబ్ల్యూహెచ్ వేరియంట్ గురించి చూస్తే 3కేడబ్ల్యూహెచ్ లో ఉన్న అన్ని అంశాలు ఉంటాయి. రేంజ్ మాత్రం అధికంగా ఉంటుంది. సింగిల్ చార్జ్ పై 190 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. మిగిలిన ఫీచర్లు, స్పెసిఫికేషన్లు అలాగే ఉంటాయి.

# అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం..




దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34000 కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధావన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు. డిహెచ్ఎఫ్ఎల్ సిఎండి కపిల్ వాధావన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. 17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా ఛార్జ్ షీట్‌లో చేర్చారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన ≈ుా×=, ఐఎఖీూ కపిల్ వాధావన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధావన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది.

# స్పోర్ట్స్

# రాయల్స్‌కు ఝలక్

**సామ్ కరన్ ఆల్‌రౌండ్ షో**

**రాజస్థాన్‌కు వరుసగా నాలుగో ఓటమి**

**లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్‌దే పైచేయి**

ఐపీఎల్-17లో ప్లేఆఫ్స్ చేరిన రాజస్థాన్ రాయల్స్ టాప్-2లో నిలిచే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. బుధవారం గువహటి వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిన ఆ జట్టు.. వరుసగా నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. బ్యాటింగ్‌లో విఫలమైన ఆ జట్టు బౌలింగ్‌తో స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే యత్నం చేసినా పంజాబ్ సారథి సామ్ కరన్ ఆల్‌రౌండ్ షోతో రాయల్స్‌కు షాకిచ్చాడు.

గువహటి: ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్తును దక్కించుకున్న రాజస్థాన్ రాయల్స్.. పంజాబ్ కింగ్స్‌తో నామమాత్రపు మ్యాచ్‌లో తడబడింది. గువహటి వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓడింది. ఇరు జట్ల బ్యాటర్లు తడబడి బౌలర్లకు అనుకూలించిన బర్సపర పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 144/9 పరుగులు మాత్రమే చేయగలిగింది. టాపార్డర్ విఫలమైనా 'లోకల్ బాయ్' రియాన్ పరాగ్ (34 బంతుల్లో 48, 6 ఫోర్లు) ఆ జట్టును ఆదుకున్నాడు. సామ్ కరన్ (2/24), హర్షల్ పటేల్ (2/28), చాహర్(2/26) రాజస్థాన్‌ను కట్టడిచేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో



పంజాబ్ కూడా తడబడింది. కానీ బంతితో రాణించిన కెప్టెన్ కరన్ (41 బంతుల్లో 63 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కరన్ కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**ఆదుకున్న పరాగ్**

మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) తొలి ఓవర్లోనే నిష్క్రమించగా కోహ్లర్ కడ్మోర్ (18) ధాటిగా ఆడలేకపోయాడు. కెప్టెన్ శాంసన్(18) మూడు సిక్సర్లతో దూకుడు మీద కనిపించినా అతడూ ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. 42 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను పరాగ్-అశ్విన్ (19 బంతుల్లో 28, 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. పరాగ్ మరోసారి ఆపద్బాంధవుడి పాత్ర పోషించడంతో రాజస్థాన్ గౌరవప్రదమైన స్కోరుచేసింది. జురెల్ డకౌట్ అవగా పావెల్ (4), ఫెరీరా (7) విఫలమయ్యారు.

**కరన్ పోరాటం..**

స్లో వికెట్‌పై పంజాబ్ బ్యాటర్లూ తడబడ్డారు. భారీ హిట్టర్లు కలిగిన పంజాబ్ ఇన్నింగ్స్ నత్తకు నడక నేర్పినట్టు సాగింది. బౌల్ట్ తొలి ఓవర్లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయినా 5 ఫోర్లు కొట్టిన రూసో పంజాబ్ స్కోరు వేగాన్ని పెంచే యత్నం చేశాడు. కానీ అవేశ్ ఖాన్ ఒకే ఓవర్లో రూసో(13 బంతుల్లో 22, 5 ఫోర్లు), శశాంక్ (0)ను ఔట్ చేయగా బెయిర్ స్టో(14)ను చాహల్ పెవిలియన్‌కు పంపాడు. 5-11 ఓవర్ల మధ్య పంజాబ్‌ను రాయల్స్ బౌలర్లు కట్టడి చేయడంతో ఆ జట్టు 31 పరుగులే చేయగలిగింది. కానీ కెప్టెన్ కరన్, జితేశ్ శర్మ (22) పోరాటం పంజాబ్‌ను పోటీలోకి తెచ్చింది. ఆఖర్లో కాస్త ఉత్కంఠ రేగినా కరన్, అశుతోష్ (17 నాటౌట్) మెరుపులతో పంజాబ్ విజయాన్ని పూర్తిచేశారు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లలో 144/9 (పరాగ్ 48, అశ్విన్ 28, కరన్ 2/24, హర్షల్ 2/28).

పంజా బ్: 18.5 ఓవర్లలో 145/5 (కరన్ 63 నాటౌట్, రూసో 22, అవేశ్ 2/28, చాహల్ 2/31)

## ప్రిక్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

## థాయ్‌లాండ్ ఓపెన్



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ తొలి రోజు భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. స్టార్ డబుల్స్ పెయిర్ సాత్విక్-చిరాగ్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లగా సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్స్ సాత్విక్-చిరాగ్.. 21-13, 21-14 తేడాతో మలేషియా ద్వయం మహ్మద్ అజ్రిన్ అయూబ్-తాన్ వీ కియోంగ్ కథను 34 నిమిషాల్లోనే ముగించారు. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన యువ సంచలనం మీరబ లువాంగ్.. 21-19, 21-18తో ప్రణయ్‌కు షాకిచ్చాడు. కిరణ్ జార్జి 15-21, 21-13, 17-21 తో క్రిస్టోఫెర్సెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు. ప్రిక్వార్టర్స్‌లో లువాంగ్.. క్రిస్టోఫెర్సెన్‌తో తలపడాల్సి ఉంది. మహిళల సింగిల్స్‌లో అష్మిత చాహిల.. 19-21, 21-15, 21-14 తో ఈస్టర్ నురుమి (ఇండోనేషియా)ను ఓడించింది. మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు.



# నీరజ్‌కే అగ్రస్థానం

**భువనేశ్వర్:** మూడేండ్ల తర్వాత స్వదేశంలో సొంత ప్రేక్షకుల మధ్య బరిలోకి దిగిన టోక్యో ఒలింపిక్స్ 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా.. ఫెడరేషన్ కప్‌లో సత్తా చాటాడు. బుధవారం రాత్రి కళింగ స్టేడియం వేదికగా జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్.. బరిసెను 82.27 మీటర్ల దూరం విసరడంతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సాధించాడు. తొలి ప్రయత్నంలో అతడు 82 మీటర్లే విసిరాడు. అయితే డీపీ మను 82.06 మీటర్లతో అతడిని అధిగమించాడు. కానీ చోప్రా నాలుగో ప్రయత్నంలో 82.27 మీటర్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. డీపీ మను (82.06) రజతం నెగ్గగా 78.39 మీటర్లతో ఉత్తమ్ పాటిల్ కాంస్యం గెలుచుకున్నాడు. లోకల్ బాయ్ కిశోర్ జెన 75.25 మీటర్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇటీవలే ముగిసిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 88.36 మీటర్ల దూరం విసిరి 0.2 సెంటిమీటర్ల తేడాతో అగ్రస్థానం కోల్పోయిన చోప్రా తాజాగా స్వర్ణం నెగ్గినా అతడి ప్రదర్శన మాత్రం ఆశించిన స్థాయిలో లేదు.



# తారక్ ఫ్యాన్స్‌కి పండగ..

## ఎన్టీఆర్ పుట్టినరోజుకి 'దేవర' అప్‌డేట్?

టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లలో 'దేవర' ఒకటి. స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే మే 20న తారక్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ లాంఛ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి అప్‌డేట్ ఇచ్చింది టీ సిరీస్ సౌత్. ఎన్టీఆర్ పుట్టిన రోజున దేవర సినిమా నుంచి మొదటి పాట వస్తుందని అభిమానులు అంతా ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. అయితే హైప్స్‌కి మరింత మసాలా యాడ్ చేస్తూ.. తాజాగా సాలిడ్ పోస్ట్ పెట్టింది టీ సిరీస్ సౌత్. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా వస్తున్న అంటూ దేవర డైలాగ్‌ను పోస్ట్ చేసింది. దీంతో తారక్ బర్త్ డే రోజు ఫస్ట్ సింగిల్ రానున్నట్లు తెలుస్తుంది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కళ్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.



# అలియాభట్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

బాలీవుడ్ బ్యూటీ 'అలియా భట్'.. ఈ పేరుకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోయిన్స్ లో ఈమె కూడా ఒకరు. అంతేకాకుండా.. అతి తక్కువ సమయంలోనే అలియఆ తన నటనతో మంచి క్రేజ్ ను సంపాదించుకుంది.ఇక స్టా?ర్ హీరో రణబీర్ ను ప్రేమించి పెళ్లాడిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత బిడ్డకు జన్మనివ్వడంతో సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. కాగా, ఈ మధ్యనే ఈ అమ్మాడు సినిమాల్లో బిజీ బిజీ అవుతున?్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. షూటింగ్స్ నుంచి ఏ చిన్న గ్యాప్ దొరికిన అలియా.. తన భర్త కూతురితో సమయాన?్ని గడిపేస్తుంటుంది.ఇక సినీ బ్యాగ్రౌండ్ ఉన్న ఫ్యామిలి నుంచి వచ్చినా కూడా తనకంటూ సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇకపోతే.. రణబీర్ ను పెళ్లి చేసుకున్న తర్వాత ఈ అమ్మడు ఆచి తూచి సినిమాలు చేస్తుంది. ఇక రణబీర్ మాత్రం వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు. కాగా, వీరిద్దరికి రాహా అనే కూతురు ఉన్న విషయం తెలిసిందే. తాజాగా అలియా భట్ తన కూతురు గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.కాగా, తాను చేసిన తప్పు తన కూతురిని చేయనివ్వనని అలియా భట్ తెలిపింది. ఈ సందర్భంగా అలియా భట్ మాట్లాడుతూ.. 'హాలీవుడ్ సినిమా హార్ట్ ఆఫ్ స్టోన్ షూటింగ్ కోసం నేను లండన్‌లో ఉన్నాను. నా తల్లి దండ్రులను వదిలి ఉండటం చాలా కష్టంగా అనిపించింది. నాకు మూడు రోజులు నిద్రపోలేదు. నేను మంచి కూతురిని కాదనే ఫీలింగ్ కలిగింది. ఇక నా కూతురిని మాత్రం 20 ఏళ్ల వరకు ఇల్లు వదిలి వేరే చోట సెటిల్ చేయనివ్వనని అలియా చెప్పుకొచ్చింది.ఎందుకంటే.. నేను ఇంటి నుంచి వెళ్లేటప్పటికి నాకు 23 ఏళ్లు. షూటింగ్ కారణంగా ఇంటికి దూరంగా ఉన్నాను. అది ఏ నగరమో కూడా నాకు తెలియదు. నేను త్వరగా ఇంటి నుండి బయటకు వచ్చేశా అనిపించింది.



# బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అయిన అనన్య!

టాలీవుడ్ యంగ్ హీరోయిన్‌అనన్య గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. జూనియర్ ఆర్టిస్ట్ గా సినీ ఇండస్ట్రీకి పరిచయమైన ఈ ముద్ద గుమ్మ తన సొంత టాలెంట్ తో హీరోయిన్గా మంచి క్రేజ్ సంపాదించుకుంది.పలు సినిమాల్లో హీరోయిన్గా నటించిన ఈ ముద్దుగుమ్మ ఆ సినిమాలతో హీరోయిన్గా మంచి గుర్తింపుని తెచ్చుకుంది. కాగా ఇటీవల వచ్చిన తంత్ర సినిమా మాత్రం అనన్యకి మంచి హిట్ అందించింది. దాంతో ఈ ముద్దుగుమ్మకు వరుస సినిమాల్లో నటించే అవకాశాలు దక్కుతున్నట్లుగా వార్తలు వినబడుతున్నాయి. ఈ క్రమంలోనే ఈమెకి బాలీవుడ్ నుండి అవకాశాలు వస్తున్నాయి అన్న వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే తాజాగా అనుచింది సమాచారం ప్రకారం ఈమె బాలీవుడ్ ఎంట్రీ కి సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. కానీ హీరోయిన్గా కాదట. రైటర్ గా ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ కి ఎంట్రీ ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. మల్లేశం సినిమాడైరెక్టర్ రాజ్ రాచకొండ తీసిన హిందీసినిమా 8 ఏ ఎం మెట్రో సినిమా కథకి తను సహకారం అందిస్తున్నట్లుగా వార్తలు వినబడుతున్నాయి. కాగా ఈ విషయాన్ని స్వయంగా ఆమె తెలియజేస్తుంది. దీంతో ప్రస్తుతం ఇదే వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఆ సినిమా ప్రస్తుతం జీ 5లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా.. ఈ సినిమా మొదట్లో.. అనన్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఒక స్లైడ్ ఉంది.. అది అనన్య షేర్ చేసింది. మొత్తానికి బాలీవుడ్ లో ఏదోక విధంగా పాగా వెయ్యబోతుందని తెలుస్తుంది.. మొత్తానికి అనన్యబాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చేసింది.

# రామ్ పోతినేని బర్త్ డే స్పెషల్..
# 'డబుల్ ఇస్మార్ట్' టీజర్ రిలీజ్

టాలీవుడ్ ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబోలో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో డబుల్ ఇస్మార్ట్ ఇస్మార్ట్ శంకర్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. పూరీ ముంబైలో డబుల్ ఇస్మార్ట్ క్లైమాక్స్ ఫైట్ సీన్ ప్లాన్ చేశాడని.. ఈ సీన్ కోసం ఏకంగా రూ.7 కోట్లు పెడుతున్నాడని టాక్. ఇదిలావుంటే.. తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. నేడు రామ్ పోతినేని పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ రామ్‌కి బర్త్ డే విషెస్ తెలుపుతూ.. డబుల్ ఇస్మార్ట్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 85 సెకన్లు ఉన్న ఈ టీజర్‌ను చూస్తే.. ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబల్ ఇస్మార్ట్ అంటూ రామ్ మాస్ ఎంట్రీతో గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఇక స్టోరీ రివీల్ చేయకుండా మరోసారి ఇస్మార్ట్ శంకర్ రోల్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించాడు రామ్. టీజర్‌లో సంజయ్ దత్ పాత్రను కూడా కాస్త వైలెంట్‌గానే చూపించారు. ఆలీ, కావ్య థాపర్, షియాజీ షిండే, ఉత్తేజ్, గెటప్ శీను తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషిస్తున్నారు.





# 15 ఏళ్ళ తర్వాత అక్కడ రీ ఎంట్రీ?

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోయింది త్రిష. తెలుగు ఇండస్ట్రీలో ఈ బుట్ట బొమ్మకు వచ్చిన క్రేజ్ అంతా ఇంత కాదు. టాలీవుడ్ లో దాదాపుగా అందరి హీరోల సరసన నటించింది.చిరంజీవి - వెంకటేష్ - మహేష్ బాబు - పవన్ కళ్యాణ్ - ఎన్టీఆర్ - బాలకృష్ణ సరసన హీరోయిన్ గా నటించి ప్రేక్షకులను మెప్పించింది. టాలీవుడ్ కు ఈమధ్య దూరంగా ఉంటూ తమిళ్ సినిమాలపై ఫోకస్ చేస్తుంది. త్రిష ఈమధ్య కాలంలో పొన్నియన్ సెల్వన్ తో మంచి హిట్ ను అందుకుంది. అయితే త్రిష ఇప్పుడు బాలీవుడ్ లో రీ ఎంట్రీ ఇస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి.సౌత్ సెలబ్రిటీలు ఇప్పటికే చాలామంది బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అలరిస్తున్నారు. అంతేకాకుండా రీసెంట్ గా లేడీ సూపర్ స్టార్ నయనతార బాలీవుడ్ లో అడుగు పెట్టి జవాన్ సినిమాతో సాలిడ్ హిట్ అందుకుంది. అలాగే త్రిష కూడా ఇప్పుడు బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తుందని తెలుస్తుంది. త్రిష గతంలో నిజానికి ఓ బాలీవుడ్ సినిమా చేసింది. 2014లో విడుదలైన 'కట్ట మిట్ట' సినిమాలో త్రిష జిల్లా కలెక్టర్ గా పాత్ర పోషించింది. అయితే త్రిష మళ్లీ 15 ఏళ్ల తర్వాత బాలీవుడ్ లో అడుగుపెడుతుంది. త్రిష ఓ స్టార్ హీరో తో రొమాన్స్ చేయనుందని తెలుస్తోంది. ఇక సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సినిమాలో త్రిష నటించనుందని టాక్ వస్తుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా రష్మిక మందన నటిస్తుందని ప్రచారం జరుగుతుంది. అయితే సల్మాన్ ఖాన్ నటిస్తున్న 'సికిందర్' సినిమాలో త్రిష కూడా నటిస్తుందని సమాచారం.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com